విశాఖపట్టణం
ఆదివారం 11 అక్టోబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 240 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# 13న ఏపీకి తమిళనాడు సీఎం విజయ్



### చంద్రబాబు, పవన్ భేటీకి ఛాన్స్

### కావేరీ జలాలపై చర్చ

**(అమరావతి - జయజయహే)**

తమిళనాడు సీఎం విజయ్ విజయవాడలో పర్యటించనున్నారు. ఈ నెల 13వ తేదీన విజయవాడకు ఆయన రానున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో విజయ్ సమావేశం కానున్నారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా కృష్ణా జలాల వాటాపై మాట్లాడనున్నారు. తెలుగు గంగ ఒప్పందం ప్రకారం తమకు నీరు అందట్లేదని ..మిగతా 2లో



# బీసీ రిజర్వేషన్లు ఖరారు

### కేటగిరీల వారీగా కేటాయింపు

### మేయర్ పదవులు: 35.29 శాతం

### మున్సిపల్ చైర్మన్ పదవులు: 33.02 శాతం

**(అమరావతి - జయజయహే)**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజేష్ రంజన్ నేతృత్వంలోని కమిషన్ అందించిన నివేదిక, సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల శాతాలను అధికారికంగా ఖరారు చేసింది. మొత్తం విభాగాల్లో జనాభా ప్రాతిపదికన, నిబంధనలకు అనుగుణంగా బీసీ వర్గాలకు న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించేందుకే ఈ కేటాయింపులు చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మరింత ఊపందుకోనుంది.

**కేటగిరీల వారీగా బీసీ రిజర్వేషన్ల వివరాలు**

మేయర్ పదవులు: 35.29 శాతం
మున్సిపల్ చైర్మన్ పదవులు: 33.02 శాతం
అర్బన్ వార్డులు: 32.78 శాతం ..మిగతా 2లో

# 14 లేదా 15న నోటిఫికేషన్

### స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

### కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్ చార్జి మంత్రులదే

### నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి చేస్తాం

### రెగ్యూలర్ పాలన పునరుద్ధరణ

### కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు





**(అమరావతి - జయజయహే)**

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కేబినెట్ భేటీలో బీసీలకు రిజర్వేషన్లు, సీట్ల కేటాయింపులపై కీలకంగా చర్చించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇంఛార్జ్ మంత్రులదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 13న అన్ని రాజకీయ పార్టీలతో ఎస్ఈసీ సమావేశం కానుందని తెలుస్తోంది. ఈ నెల 14 లేదా 15న ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. 3 దశలలో నవంబర్ 30లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎస్ఈసీ నిర్ణయం తీసుకుంది.

కేబినెట్ భేటీ ముగిసిన తరువాత మంత్రులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయి వారికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి చేసి, రెగ్యులర్ పాలన వచ్చేలా చూద్దామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 100శాతం గెలవాలని ఆకాంక్షించారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇంఛార్జ్ మంత్రులదేనని, చురుకుగా వ్యవహరిస్తూ వారి విజయం సాధించేలా చూసుకోవాలని సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ, వారి రిజర్వేషన్లకు చట్టబద్ధమైన రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డెడికేటెడ్ బీసీ కమిషన్ (రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్) ..మిగతా 2లో

# పండుగ చేసుకోలేం..!

### ఆర్థిక స్థోమత సరిపోవడం లేదు

### 53.6 శాతం భారతీయులు వెల్లడి

### ఆర్థిక ఒత్తిడిలో సగానికిపైగా కుటుంబాలు

### 11.6 శాతమ మందికి మాత్రమే ఓకే

### సీ - ఓటర్ జాతీయ సర్వేలో వెల్లడి

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

రాబోయే పండుగ సీజన్‌లో కొత్త వస్తువులు కొనడానికి, ప్రయాణాలు చేయడానికి ఆసక్తి చూపుతున్నప్పటికీ, పెరిగిన కుటుంబ ఖర్చులు, ఆర్థిక అనిశ్చితి భారతీయ వినియోగదారుల ఉత్సాహంపై నీళ్లు చల్లుతున్నాయి. ముఖ్యంగా భారీ ఖర్చులతో కూడిన వస్తువుల కొనుగోలుకు సామాన్యులు వెనుకంజ వేస్తున్నారని సీవోటర్ నిర్వహించిన జాతీయ సర్వేలో వెల్లడైంది. తక్కువ ఆదాయ వర్గాల ప్రజలు తమ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ఆందోళన చెందుతుండగా, ఉన్నత ఆదాయ వర్గాలు మాత్రం భవిష్యత్తుపై ధీమాతో ఉన్నాయని ఈ సర్వే వివరాలు చెబుతున్నాయి. సర్వేలో వెల్లడైన అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే.. దేశంలో సగానికి పైగా కుటుంబాలు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో 53.6 శాతం



### తల్లికి వందనం

# రెండో విడత రెడీ

### లబ్ధిదారులను ఖరారు చేసిన ప్రభుత్వం

### రూ.10,208.69 నిధుల మంజూరు



2




# నిర్బంధం!

### నలుగురు సీఎంలు, 7వేల కార్యకర్తలు అదుపులోకి

### సీజేపీ నిరసనలపై ప్రభుత్వం ఉక్కుపాదం

### దేశ రాజధానిలో తీవ్ర ఉద్రిక్తత

### మోదీ, షా నియంతృత్వమన్న ప్రియాంక, రాహుల్

**(అమరావతి - జయజయహే)**

దేశ రాజధానిలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన వేలాది మందిని పోలీసులు అడ్డుకున్నారు. నిరసన చేపట్టేందుకు వచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు పలువురు ఇండీ కూటమి నేతలు, వామపక్ష నాయకులు, సామాజిక ..మిగతా 2లో

### రెండో దశ

# జనగణనకు షెడ్యూల్

### 40 ప్రశ్నలతో జాబితా ఖరారు

### వచ్చే జనవరి 10 55 రోజుల వరకు గడువు




**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

దేశం అభివృద్ధి చెందాలంటే జనాభా ఎంతమంది ఉన్నారో స్పష్టంగా లెక్క తెలియడం ఎంతో ముఖ్యం. ఎందుకంటే, సంక్షేమ పథకాల అమలుతో పాటు అనేక అంశాలకు ఇవే ప్రామాణికం. పరిపాలనా వ్యవస్థ సులభతరం చేసేందుకు ఇవి దోహదపడతాయి. ఐదు సంవత్సరాల క్రితమే జనగణన జరగాల్సి ఉన్నా కరోనా కారణంగా వాయిదా పడింది. అప్పటి నుంచి మేధోమథనం చేసిన కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు జనాభా లెక్కలను ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిని రెండు విడుతల్లో డిజిటల్ విధానంలో 2027 నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. తొలిదశలో గృహాల లిస్టింగ్, గణన (2026 ఏప్రిల్-సెప్టెంబర్) చేపట్టారు. ఈ మేరకు ఏప్రిల్ 1న ఇది ప్రారంభమైంది. మొత్తం 33 ప్రశ్నల ఆధారంగా వివరాలు నమోదు చేశారు. ఏపీలో ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30 వరకూ ..మిగతా 2లో

### జగన్ అక్రమాస్తుల

# కేసును తేల్చాలి

### రోజూవారీ విచారణ చేయాలి

### తొమ్మిది చార్జిషీట్లు పదేళ్లుగా పెండింగ్

### తెలంగాణ హై కోర్టులో ఈడీ పిటీషన్




2

# పండుగ చేసుకోలేం..!

మొదటి పేజీ తరువాయి...

మంది తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి గతేడాదితో పోలిస్తే 'మరింత' క్షీణించిందని తెలిపారు. కేవలం 11.6 శాతం మంది మాత్రమే తమ పరిస్థితి మెరుగైందని పేర్కొనగా, 27.1 శాతం మంది ఎలాంటి మార్పు లేదని చెప్పారు. సెప్టెంబర్ 28, 29 తేదీల్లో 2,051 మంది ప్రతినిధుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

**గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య స్పష్టమైన వ్యత్యాసం..**

ఆర్థిక ఒత్తిడి విషయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో 40.6 శాతం మంది తమ ఆర్థిక పరిస్థితి దిగజారిందని చెబితే, గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య ఏకంగా 59.2 శాతానికి చేరింది! రాబోయే ఏడాదైనా పరిస్థితులు చక్కబడతాయా అంటే నిరుత్సాహమే వ్యక్తమవుతోంది. కేవలం 24.4 శాతం మంది మాత్రమే భవిష్యత్తులో పరిస్థితులు మెరుగుపడతాయని భావిస్తుండగా, 38 శాతం మంది పరిస్థితులు మరింత దిగజారుతాయని భయపడుతున్నారు. తక్కువ ఆదాయ వర్గాల్లో ఏకంగా 63.2 శాతం మంది ఆర్థిక ఇబ్బందులు పెరిగాయని చెప్పగా, ఉన్నత ఆదాయ వర్గాలలో ఈ శాతం కేవలం 26.3గా ఉంది.

**దుస్తులు, సాంప్రదాయ మిఠాయిలకే ప్రథమ ప్రాధాన్యం**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, పండుగ సంప్రదాయాలను పాటించడంలో భారతీయులు వెనక్కి తగ్గడం లేదని సీవోటర్ సర్వే ద్వారా తెలుస్తోంది. 45 శాతం మంది కుటుంబ సభ్యుల కోసం కొత్త దుస్తులు కొనుగోలు చేశామని లేదా కొనడానికి




ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఇందులో 16.9 శాతం మంది కుటుంబం మొత్తానికి, 20.4 శాతం మంది పిల్లల కోసం దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. అయితే, 45.4 శాతం మంది ఈసారి కొత్త బట్టలు కొనే ఆలోచన లేదని చెప్పడం.. మారిన బడ్జెట్ పరిమితులను సూచిస్తోంది. స్వీట్ల విషయంలో విదేశీ చాక్లెట్ల కంటే స్థానిక మిఠాయిలకే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. 33 శాతం మంది స్థానిక షాపుల్లో సాంప్రదాయ తీపి పదార్థాలు కొంటామని చెప్పగా, విదేశీ చాక్లెట్లను ఎంచుకున్నది కేవలం 3.1 శాతం మంది మాత్రమే. ఇది స్థానిక వ్యాపారులకు ప్రాధాన్యత ఇచ్చే వైఖరిని ప్రతిబింబిస్తోంది.

**భారీ కొనుగోళ్లకు దూరంగా సామాన్యుడు..**

పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సిన వస్తువుల విషయంలో భారతీయ వినియోగదారులు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. కేవలం 21.5 శాతం మంది మాత్రమే వంటగది ఉపకరణాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపగా, 18.5 శాతం మంది ఎలక్ట్రానిక్స్ వస్తువులపై దృష్టి పెట్టారు. ద్విచక్ర వాహనాలు, కార్లు లేదా పసిడి ఆభరణాలు కొనాలని 22 శాతం మంది భావిస్తున్నారు. ఇళ్లకు రంగులు వేయడం, మరమ్మతులు చేయడం వంటి పనులకు 50.2 శాతం మంది దూరంగా ఉంటున్నారు. చెల్లింపుల విషయంలో కూడా 32.2 శాతం మంది నేరుగా పూర్తి నగదు చెల్లిస్తామని చెప్పగా, 12.8 శాతం మంది ఈఎంఐ పద్ధతిని ఎంచుకుంటున్నారు. 32.1 శాతం మంది ఏ విధమైన భారీ కొనుగోళ్లు చేయడం లేదని స్పష్టం చేశారు.

**దేశీయ, ఆధ్యాత్మిక ప్రయాణాల వైపే మొగ్గు..**

పండుగ సెలవుల్లో ప్రయాణాల విషయానికి వస్తే, 47.5 శాతం మంది కుటుంబంతో కలిసి ప్రయాణాలు చేయడానికి ప్రణాళికలు వేసుకుంటున్నారు. అందులో స్థానిక ప్రాంతాలకు వెళ్లేవారు 15.7 శాతం ఉండగా, 15.1 శాతం మంది పుణ్యక్షేత్రాల సందర్శనకు (ఆధ్యాత్మిక యాత్రలకు) ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈసారి విదేశీ ప్రయాణాలకు కేవలం 1.7 శాతం మంది మాత్రమే ఆసక్తి చూపారు. దీనిబట్టి పండుగ వేళ సుదూర ప్రాంతాలు, విదేశాల కంటే స్వదేశీ, ఆధ్యాత్మిక ప్రయాణాలకే డిమాండ్ ఎక్కువగా ఉందని స్పష్టమవుతోంది. భారత కుటుంబాల్లో కనిపిస్తున్న ఆర్థిక ఒత్తిడికి ప్రధాన కారణం.. ఈ ఏడాది మార్చ్‌లో ప్రారంభమైన అమెరికా-ఇరాన్ యుద్ధమే. దీని వల్ల ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఫలితంగా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. దీని వల్ల దేశవ్యాప్తంగా నిత్యావసర ధరలకు రెక్కలు వచ్చాయి. వీటి వల్ల సామాన్యుడి ఆర్థిక ప్రణాళికలు చితికిపోతున్నాయి.

# నిర్బంధం!

మొదటి పేజీ తరువాయి...

కార్యకర్తలను నిర్బంధించారు. మరోవైపు, జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన 7వేల మందికిపైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ముందస్తు చర్యల్లో భాగంగా నేర చరిత్ర ఉన్న 600 మందికిపైగా వ్యక్తులను కూడా నిర్బంధించినట్లు తెలిపారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పోలీసులు విమానంలోనే అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నిరసనలో పాల్గొనేందుకు ముంబయి నుంచి ఢిల్లీకి వచ్చిన ఆయనతో పాటు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. అందుకు సంబంధించిన దృశ్యాలను సీజేపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తమ నాయకులను నిరసన ప్రదేశానికి వెళ్లకుండా ముందస్తు ప్రణాళికతో అడ్డుకున్నారని పార్టీ ఆరోపించింది. ఇది పౌర హక్కులను ఉల్లంఘించడమేనని విమర్శించింది.

**కేజ్రీవాల్, మమతా బెనర్జీ నిర్బంధం**

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన నివాసం నుంచి జంతర్‌మంతర్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో ఆప్ కార్యకర్తలు పోలీసులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కేజ్రీవాల్‌ను ఎత్తుకుని బస్సు వద్దకు తీసుకెళ్లారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ పార్టీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ సహా పలువురు నేతలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓట్ల చోరీ జరుగుతోందని ప్రధాని మోదీపై ఆరోపణలు చేశారు. దేశ యువత మేల్కొందని, అన్యాయానికి భయపడబోరని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని సౌత్ అవెన్యూ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జంతర్‌మంతర్‌కు వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆమె పార్టీ నేతలతో కలిసి అక్కడే బైఠాయించారు. ఈ నిరసనలో డెరెక్ ఓబ్రియన్, దోలా సేన్ సహా పలువురు తృణమూల్ నేతలు



పాల్గొన్నారు. మమతా బెనర్జీ నోటికి బ్యాండేజ్ వేసుకుని నిరసన తెలిపారు. దేశంలో పరిస్థితి ఎమర్జెన్సీని మించిపోయిందని, ఇది సూపర్ ఎమర్జెన్సీలా ఉందని ఆమె విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడాలన్నదే తమ సందేశమని పేర్కొన్నారు.

**వామపక్ష నేతలూ అదుపులోకి**

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, వామపక్ష నేత బృందా కారత్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేరళ భవన్ బయట నుంచి జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో వారిని అడ్డుకున్నారు. పోలీసుల చర్యకు వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. విజయన్ ఈ ఘటనపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ప్రతిపక్ష నేతలను చూసి భయపడుతున్నందుకే పోలీసులు ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకుని, గంటపాటు వాహనాల్లో తిప్పారని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులపై ఇలాంటి చర్యలతో తమను భయపెట్టలేరని పేర్కొన్నారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీని పోలీసు శిబిరంగా మార్చినప్పటికీ నిరసనల్లో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారని దీపాంకర్ భట్టాచార్య అన్నారు. ఒక ప్రాంతంలో నిరసనను అడ్డుకున్నా, ఉద్యమ స్ఫూర్తిని ఆపలేరని వ్యాఖ్యానించారు.

**ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరు: ఖర్గే**

మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య జననిగా ఉన్న వ్యవస్థను నోరు మూసిన ప్రజాస్వామ్యంగా కేంద్ర సర్కార్ మార్చివేసిందని ఆరోపించారు. బీజేపీ- ఆర్ఎస్ఎస్ పిరికితనం నేడు బయటపడిందని ఆరోపించారు. "మన యువత, విద్యార్థులు, న్యాయవాదులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, రైతు సంఘాల నాయకులు, యూట్యూబర్లు, కంటెంట్ సృష్టికర్తలు ఇలా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరినీ నిర్బంధిస్తున్నారు" అంటూ పోస్ట్ చేశారు. నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లు, లాఠీలు, పెల్లెట్లతో భారత ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరని స్పష్టం చేశారు. నిరంకుశ పాలనపై కాంగ్రెస్ పార్టీ, ఇండీ కూటమితో కలిసి సర్వశక్తులు ఒడ్డి పోరాడుతుందని ఖర్గే చెప్పారు. "భారత స్వాతంత్ర్యం కోసం మేం మా రక్తాన్ని చిందించాం. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కులను కాపాడుకోవడానికి మా శక్తివంచన లేకుండా పోరాడుతూనే ఉంటాం" అని ఖర్గే తెలిపారు.

**మోదీ, షా నియంతృత్వ దేశం: ప్రియాంక గాంధీ**

భారత్ ఇకపై ప్రజాస్వామ్య దేశని కాదని, ప్రధాని మోదీ-అమిత్ షాలు నడుపుతున్న నియంతృత్వమని ఆరోపించారు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా. "మొదట వారు 254 మంది ఎంపీలను తీవ్రంగా కొట్టి, వారి ప్రాథమిక రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ పూర్తిగా చట్టవిరుద్ధంగా నిర్బంధిస్తారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇతర నిరసనకారుల పట్ల కూడా వారు అదే విధంగా ప్రవర్తిస్తారు. ఆ తర్వాత వారు జాతీయ రాజధానిని ముట్టడిస్తారు, దానికి బారికేడ్లు పెట్టి అన్ని వైపులా మూసివేస్తారు, రైళ్లు, మెట్రోలను నిలిపివేస్తారు, ఇంటర్నెట్‌ను నిలిపివేస్తారు. అన్నిచోట్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తారు. నిరసన తెలిపే తమ రాజ్యాంగ హక్కును వినియోగించుకుంటున్న యువతీ యువకులను కొట్టి నిర్బంధిస్తారు. ఎన్నికల సంఘం కుమ్మక్కుతో వారు ఎన్నికలలో మోసం చేశారనడానికి, తమ ప్రభుత్వ చట్టబద్ధత బట్టబయలవుతోందని ఇది రుజువు కాకపోతే మరేమిటి? ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికి వారితో కుమ్మక్కవుతున్న వారందరూ దేశద్రోహానికి పాల్పడుతున్నారు" అంటూ ఆరోపణలు చేశారు.

**సుప్రీంకోర్టులో విచారణ**

ఢిల్లీలో సీజేపీ నిరసనల వేళ మెట్రో, రైలు సేవలు పూర్తిగా నిలిపివేయకూడదంటూ ఇచ్చిన ఆదేశాన్ని అధికారులు ఉల్లంఘించారని ఆరోపిస్తూ, వారిపై చర్యలు ప్రారంభించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌పై జస్టిస్ జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం విచారణ చేపట్టనుంది.

## తల్లికి వందనం
# రెండో విడత రెడీ

(అమరావతి - జయజయహే)

పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పేద విద్యార్థులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం కింద రెండో విడత లబ్ధిదారులను ఖరారు



చేసింది. ఈ విద్యా సంవత్సరంలో తొలి విడత నిధులు విడుదల చేసిన తర్వాత, సాంకేతిక లేదా ఇతర కారణాలతో డబ్బులు జమకాని అర్హుల నుంచి ప్రభుత్వం వివరాలు, ఫిర్యాదులను స్వీకరించింది. అనంతరం క్షేత్రస్థాయిలో వారి అర్హతలను సమగ్రంగా పరిశీలించి, రెండో విడతలో వారికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే లబ్ధిదారుల నుంచి వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదులను పరిష్కరించిన అధికారులు.. రెండో దశలో 3,29,201 మందిని అర్హులుగా ఖరారు చేశారు. వీరికి 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.10,208.69 ఆర్థిక సహాయాన్ని విడుదల చేయడానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.ఆ వివరాలను ఈ కింద పట్టికలో మీరు చూడవచ్చు.

## రెండో దశ
# జనగణనకు షెడ్యూల్

మొదటి పేజీ తరువాయి...

ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆ తర్వాత మే 1 నుంచి మే 30 వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపట్టారు. ఇందులో భాగంగా ఎన్ని ఇళ్లు ఉన్నాయి? అందులో బిల్డింగ్ మెటీరియల్స్ వివరాలు నమోదు చేశారు. అంటే ఫ్లోరింగ్, వాల్, రూఫ్, విద్యుత్ సౌకర్యాలు వంటివి ఉన్నాయా అన్నది చెక్ చేశారు. అలాగే సెల్ ఫోన్స్, టీవీలు, రేడియోలు సహా ఇతరత్రా గ్యాడ్జెట్లు, ఇంటర్‌నెట్ సౌకర్యం వంటివి నమోదు చేశారు. ద్విచక్రవాహనాలు, కార్లు ఇతర వాహనాలతో పాటు తృణ ధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్లు వాడకం, వంటగది సౌకర్యాలు, వంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరించారు. ఒకవేళ ఇంటి నంబర్లు లేకపోతే జనగణన ప్రక్రియ కింద ప్రత్యేక నంబర్లు వేసి ఇళ్ల జాబితాలో చేర్చారు.ఈ క్రమంలోనే ఇప్పుడు రెండో దశలో జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి-మార్చి 1)ను నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు ఆన్‌లైన్ స్వీయగణనను 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు అవకాశం కల్పించారు. ఈ 15 రోజుల వ్యవధిలో ఈ స్వీయగణన నమోదుకు వీలుంది. ఇంటింటి గణనకు 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు వ్యవధి ఇచ్చారు. 35 రోజుల పాటు ఈ ప్రక్రియను నిర్వహించనున్నారు. రివిజనల్ రౌండ్ కూడా ఇందులో భాగంగా ఉంటుంది. దీనిని 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈమేరకు జనగణన విభాగం తాజా వివరాలు ప్రకటించింది. మొత్తం 55 రోజుల పాటు రెండోదశ జనగణన నిర్వహిస్తారు. కులగణన కూడా ఈ సమయంలో చేపట్టనున్నారు.

మరోవైపు శుక్రవారం నాడు సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో భారత రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ మృత్యుంజయకుమార్ నారాయణ్ సమావేశాన్నినిర్వహించారు. మొదటి దశలో గృహ జాబితాలు, గణన ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేసిన అధికారుల్ని అభినందించారు. అదే స్ఫూర్తితో రెండో దశ కూడా నిర్వహించాలని కోరారు. రెండో దశలో 40 ప్రశ్నలకు సంబంధించిన వివరాలు సేకరించాలని చెప్పారు. మతం, కులం, దివ్యాంగత్వం, వృత్తి తదితర సున్నితమైన అంశాలపై వివరాలు సేకరించేటప్పుడు ప్రజల భావాలను గౌరవించాలన్నారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొనేలా చూడాలని సూచించారు. ఈ మేరకు అధికార యంత్రాంగం అంతా సిద్ధంగా ఉండాలని, వారికి అవసరమైన శిక్షణాకార్యక్రమాలను నిర్వహించాలని మృత్యుంజయకుమార్ నారాయణ్ నిర్దేశించారు.



# 14 లేదా 15న నోటిఫికేషన్

మొదటి పేజీ తరువాయి...

సమర్పించిన నివేదిక, సిఫార్సులకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ కొత్త నిర్ణయం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు లభించే స్థానాలు పెరగనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికల్లో కేవలం 33 వేల మంది బీసీలకు మాత్రమే అవకాశాలు దక్కగా, ప్రస్తుత నిర్ణయంతో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో దాదాపు 38 వేల మందికి పైగా బీసీ ప్రజాప్రతినిధులకు పదవులు దక్కనున్నాయి. బీసీలకు గతంలో కంటే సుమారు 4 వేలకు పైగా స్థానాలు రగనున్నాయి. జిల్లాలు, వార్డులు, డివిజన్ల పునర్విభజనతో పాటు పెంపును పరిగణనలోకి తీసుకుని, జనాభా ప్రాతిపదికన ఈ రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలు మినహా ఇతర అన్ని విభాగాల పరిధిలోని దాదాపు 1.40 లక్షలకు పైగా స్థానాల్లో బీసీ రిజర్వేషన్లను వర్తింపజేసేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. స్థానిక చట్టాలు, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు భంగం వాటిల్లకుండానే బీసీలకు గరిష్ట స్థానాల్లో పోటీ చేసేలా ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. అంతేకాకుండా, సుప్రీంకోర్టు తీర్పులు, మార్గదర్శకాలకు అనుగుణంగా మొత్తం రిజర్వేషన్ల శాతం 50 శాతానికి మించకుండా డెడికేటెడ్ కమిషన్ చేసిన సిఫార్సులను ఏపీ ప్రభుత్వం ఆమోదించింది. దీని ద్వారా న్యాయపరమైన చిక్కులు రాకుండా పక్కాగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఏవైనా కేటగిరీలలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం కంటే తక్కువగా ఉంటే, కూటమి పార్టీల తరపున ఆయా పదవులను బీసీలకే కేటాయిస్తామని చంద్రబాబు ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

# 13న ఏపీకి తమిళనాడు సీఎం విజయ్

మొదటి పేజీ తరువాయి...



తమిళనాడు సర్కార్ చెబుతోంది. ఏపీ నుంచి రావాల్సిన నీటి వాటాపై చంద్రబాబుతో విజయ్ చర్చించే అవకాశాలు ఉన్నాయి. ఏపీ నిర్మించతలపెట్టిన డ్యామ్‌ల అంశంపైనా మాట్లాడే ఛాన్స్ ఉంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనూ విజయ్ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# బీసీ రిజర్వేషన్లు ఖరారు

మొదటి పేజీ తరువాయి...

సర్పంచ్ స్థానాలు: 27.95 శాతం
పంచాయతీ వార్డులు: 26.73 శాతం
ఎంపీటీసీ (పూజ) స్థానాలు: 25.55 శాతం
ఎంపీపీ (పీఠా) పదవులు: 24.60 శాతం
జడ్పీటీసీ (గ్రాజ) స్థానాలు: 24.60 శాతం
జడ్పీ చైర్మన్ పదవులు: 23.08 శాతం

**స్థానాల వారీగా బీసీలకు దక్కనున్న సీట్ల వివరాలు:**

| పదవి / స్థానం | మొత్తం స్థానాలు | బీసీలకు కేటాయించిన సీట్లు |
|---|---|---|
| కార్పొరేషన్ మేయర్లు | 17 | 6 (35.29%) |
| మున్సిపల్ చైర్మన్లు | 106 | 35 |
| మున్సిపల్ వార్డులు | 3,884 | 1,273 |
| జిల్లా పరిషత్ చైర్మన్లు | 28 | 7 |
| జెడ్పీటీసీలు (ZPTC) | 661 | 152 |
| ఎంపీపీలు (MPP) | 661 | 152 |
| ఎంపీటీసీలు (MPTC) | 9,913 | 2,400 |
| సర్పంచ్‌లు | 13,351 | 3,128 |
| పంచాయతీ వార్డు సభ్యులు | 1,33,910 | 30,315 |

## జగన్ అక్రమాస్తుల
# కేసును తేల్చాలి

### రోజూవారీ విచారణ చేయాలి
### తొమ్మిది చార్జిషీట్లు పదేళ్లుగా పెండింగ్
### తెలంగాణ హై కోర్టులో ఈడీ పిటీషన్

(హైదరాబాద్ - జయజయహే)



వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. రోజువారీ విచారణ జరిపి వేగంగా ఈ కేసులను తేల్చాలని అధికారులు పిటిషన్‌లో కోరారు. జగన్ సహా నిందితులందరినీ వ్యక్తిగతంగా న్యాయస్థానంలో హాజరయ్యేలా ఆదేశించాలని కోరారు. సీబీఐ కోర్టులో తొమ్మిది ఈడీ ఛార్జిషీట్లు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని పిటిషన్‌లో ప్రస్తావించారు. సీబీఐ కోర్టులో డిశ్చార్జి పిటిషన్లు తేలకపోవడంతో విచారణ ముందుకెళ్లట్లేదని తెలిపారు. ఆర్థిక నేరాలను దేశ ఆర్థిక రంగానికే ముప్పుగా పరిగణించాలని కోరారు. ఈడీ పిటిషన్‌పై హైకోర్టు ఇటీవల విచారణ జరిపిన విషయం తెలిసిందే. జగన్ కేసులు త్వరగా తేల్చాలని గతంలోనూ పిటిషన్ దాఖలైనట్లు హైకోర్టు గుర్తించింది. హరిరామజోగయ్య, ఇతరుల పిటిషన్లతో కలిపి పిటిషన్‌ను జత చేయాలని న్యాయస్థానం ఈడీ అధికారులను ఆదేశించింది. జగన్ కేసులను వేగంగా విచారణ జరపాలనే అన్ని పిటిషన్లను కలిపి ఈనెల 13వ తేదీన తెలంగాణ హైకోర్టు విచారణ జరపనుంది.

# ముస్లిం మైనారిటీలకు 10 స్థానాలు కేటాయించాలి: టీడీపీ నేతల విజ్ఞప్తి

**విశాఖపట్నం. జయ జయహే**

రాబోయే విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లిం మైనారిటీ వర్గానికి కనీసం 10 స్థానాలు (సీట్లు) కేటాయించాలని తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీ విభాగం నాయకులు విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్ మరియు ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీల ముఖ్య సలహాదారు, శాసనమండలి మాజీ చైర్మన్, విశాఖ జిల్లా ఎన్నికల ఇన్‌ఛార్జ్ మహమ్మద్ అహ్మద్ (ఎం.ఎ.) షరీఫ్ ని శనివారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షకులు మరియు ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన షరీఫ్ కి ఈ సందర్భంగా



నాయకులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ ఆవిర్భావం నుండి ముస్లిం మైనారిటీలు తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ పటిష్టతకు అంకితభావంతో కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లా రాజకీయాల్లో, ప్రజాసేవలో చురుగ్గా పాల్గొంటున్న మైనారిటీ నాయకులు, కార్యకర్తల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం 10 స్థానాలను కేటాయించి ప్రజాప్రతినిధుల సభల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. తద్వారా శ్రేణుల్లో నూతనోత్సాహం నింపడమే కాకుండా ఎన్నికల్లో పార్టీ విజయానికి బలమైన తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్, ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ గారితో పాటు జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు, మాజీ కార్పొరేటర్ రఫీ, అబ్దుల్ చిన్న రెహమాన్, మహమ్మద్ గౌస్, షేక్ కాలేశా, అబ్దుల్ అనీఫ్, అబ్దుల్ సలీమా, సుభాన్, అన్వర్ హుస్సేన్, హిమాయతుల్లా, బాబా తదితరులు పాల్గొన్నారు.



## కిమ్స్ ఐకాన్‌లో ఈఎస్ఐ చట్టాలపై అవగాహన సదస్సు

**ఉద్యోగులు తమ హక్కులు, వైద్య సదుపాయాలపై అవగాహన**

**విశాఖపట్నం, అక్టోబర్ 10, జయ జయహే**

ఉద్యోగులకు ఈఎస్ఐ చట్టాలు, వాటి ద్వారా లభించే ప్రయోజనాలు, వైద్య సేవలపై అవగాహన కల్పించేందుకు విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈఎస్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ జి. వేణు మాధవ్, గాజువాక బ్రాంచ్ మేనేజర్ పి. రమేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రి ఉద్యోగులకు ఈఎస్ఐ చట్టాలపై సమగ్రంగా వివరించారు. ఈఎస్ఐ పరిధిలో ఉద్యోగులకు అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, సంక్షేమ ప్రయోజనాలు, చట్టపరమైన హక్కులతోపాటు ఆయా సేవలను పొందే విధానాలపై అవగాహన కల్పించారు. ఈఎస్ఐ ద్వారా అందించే ప్రయోజనాలను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని, తమకు ఉన్న హక్కులు, అందుబాటులో ఉన్న సేవల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా వివరించారు. కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) ఎన్. తన్మయ్ బాబు, ఉమా శంకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్యోగులకు ఉపయోగపడే చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ముజీబ్ ఖాన్ ఆర్థిక సహాయం

**విశాఖపట్నం జయ జయహే**

విశాఖపట్నం 36వ వార్డు చిలకపేటకు చెందిన గటితి అప్పలనరసమ్మ కొంతకాలంగా షుగర్, బీపీతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అనారోగ్య సమస్యలు తీవ్రం కావడంతో ఆమె ఒక కాలును తొలగించాల్సి వచ్చింది. ఈ విషయాన్ని స్థానిక కార్యకర్తలు 36వ వార్డు అధ్యక్షులు ఎండీ ముజీబ్ ఖాన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ముజీబ్ ఖాన్ మానవతా దృక్పథంతో బాధితురాలికి అండగా నిలిచారు. ఆమె కుటుంబానికి అవసరమైన నిత్యావసర సరుకులను అందించడంతో పాటు వైద్య ఖర్చుల నిమిత్తం కొంత నగదు ఆర్థిక సహాయంగా అందజేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు తమ వంతు సహాయం అందించడం సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

**పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసిన సియ్యారి దొన్ను దొర, కిడారి శ్రవణ్ కుమార్**

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని అరకు టీడీపీ ఇన్‌చార్జ్, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర, రాష్ట్ర జీసీసీ చైర్మన్, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు. ముంచంగిపుట్టు మండలం బూసిపుట్ పంచాయతీ పరిధిలో శనివారం కూటమి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేస్తూ స్థానిక ఎన్నికల్లో సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కూడా భూషణ్ రావు, అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పాంగి కామేష్, పిఎసిఎస్ చైర్మన్ సామల బాబుజి, పిఎసిఎస్ చైర్మన్ ప్రసాద్, టీడీపీ మండల కార్యదర్శి కె. జాగత్రాయ్, మాజీ సర్పంచ్ టీడీపీ డివిజన్ నాయకుడు పాంగి పాండురంగస్వామి, మాజీ సర్పంచ్ వి లక్ష్మణ్, మాజీ సర్పంచ్ ముత్యాలమ్మ, క్లస్టర్ ఇంచార్జ్ బిరామారావు, యూనిట్ ఇంచార్జ్ లైకోన్, బలరాం, టీడీపీ పంచాయతీ అధ్యక్షులు సింహాచలం, బీజేపీ నాయకుడు తిరుపతి రావు, జనసేన నాయకుడు ప్రసాద్, బిజెపి నాయకుడు సురేష్, గాసిరం, అచ్చిబాబు, కూటమి నాయకులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## అథ్లెటిక్స్‌లో బుల్లయ్య కళాశాలకు బంగారు పతకాలు

**విశాఖపట్నం, అక్టోబర్ 10, జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖపట్నంలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాలు సాధించారు. కర్నూలు జిల్లాలో అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలు సాధించి కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. అండర్-18 విభాగంలో ఎంఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ. సిరి చందన హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించింది. అలాగే, ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న డి. రామ్ హితేష్ 80 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటడం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ జి. మధు కుమార్ విద్యార్థులను అభినందించారు. క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచడం గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ టి. బ్రహ్మానంద రెడ్డి, వ్యాయామ విభాగాధిపతి ఫ్లైట్ లెఫ్టినెంట్ డాక్టర్ బి.ఆర్.ఎస్. లక్ష్మణ్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ పి. రెడ్డి పాల్గొని పతక విజేతలను అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.

## వెలగలపాలెంలో మీకోసం కార్యక్రమం




**కొయ్యూరు (జయ జయహే న్యూస్)**

**అక్టోబర్ 11,**

కొయ్యూరు మండలంలోని వెలగలపాలెం స్వర్ణ గ్రామ సచివాలయంలో ఈ నెల 12వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ మీకోసం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీడీవీ ప్రసాదరావు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రత్యేక అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో సమర్పించాలని, సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## కంటి వైద్య శిబిరాలకు విశేష స్పందన

**108 మందికి కంటి పరీక్షలు..**

**28 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తింపు**

**ముంచంగిపుట్టు, జయ జయహే : మండలంలో గల**

కిలగాడ, లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య అధికారి శ్యాం ప్రసాదు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కంటి వైద్య కంటి వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఈ శిబిరాలలో వివిధ రకాల కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న మొత్తం 108 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 28 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వీరిని తదుపరి చికిత్స కోసం విజయనగరంలో గల పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు.




కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించేందుకు ఈ శిబిరాలు నిర్వహించారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి పంపినట్లు ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కిషోర్ కుమార్ తెలిపారు.

## తూర్పు ఎన్నికల సమన్వయకర్తగా వన్నెంరెడ్డి

**నియమించడంపై పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు**

**రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తాం**

**గ్రంథాలయ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్**

**విశాఖపట్నం, అక్టోబర్ 10, జయ జయహే**

విశాఖపట్నం పార్లమెంటరీ పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయం కోసం విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త సభ్యునిగా తనను నియమించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిష్పక్షపాతంగా, చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని



పేర్కొన్నారు. విశాఖపట్నం తూర్పు నియోజకవర్గంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ, కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. నాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకుని ఎన్నికల్లో విజయానికి కృషి చేస్తానని వన్నెంరెడ్డి సతీష్ కుమార్ తెలిపారు.

## ధవళేశ్వరంలో ఆర్టీసీ బస్సు ఢీకొని యువతి మృతి

**తండ్రికి గాయాలు.. రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా ప్రమాదం**

**విశాఖలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం... స్వగ్రామంలో విషాదం**

**రాజమహేంద్రవరం : జయ జయహే:అక్టోబర్ 10:**

ధవళేశ్వరంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందగా, ఆమె తండ్రి గాయపడ్డారు. ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ సమీపంలోని కల్వర్టు వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రావులపాలెంలోని ఆదిలక్ష్మీనగర్‌కు చెందిన గుండారపు గోవిందరాజు (46) తన కుమార్తె గుండాలపు శాంభవి (22)తో కలిసి హోండా షైన్ ద్విచక్రవాహనంపై రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు బయలుదేరారు. విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న శాంభవిని రైల్వేస్టేషన్‌లో దింపేందుకు తండ్రి తీసుకువెళ్తున్నారు. ఈ క్రమంలో ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కల్వర్టు వద్దకు చేరుకోగానే.. రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఏపీఎస్ఆర్టీసీ



బస్సు (నంబరు ఇూ 05, 0063) వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శాంభవి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె తండ్రి గోవిందరాజుకు ఎడమ మోచేతికి గాయమైంది. ప్రమాదంతో ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది. విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కుమార్తెను రైల్వేస్టేషన్‌లో దింపేందుకు వచ్చిన తండ్రికి ఈ దుర్ఘటన ఎదురవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. గోవిందరాజు రావులపాలెంలో టైలరింగ్ పని చేస్తుంటారు. సమాచారం అందుకున్న ధవళేశ్వరం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అరకు నియోజకవర్గ ఎన్నికల కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా శ్రావణ్ కుమార్

**జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు**

**ముంచంగిపుట్టు, జయ జయహే**

జనసేన పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆర్ శ్రావణ్ కుమారును అరకు నియోజకవర్గం ఎన్నికల కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడుగా పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అరకు నియోజకవర్గ ఎన్నికల కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా తనను ఎంపిక చేసిన జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు శ్రావణ్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేత తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా అన్నారు.






## వ్యాపార రంగంలో మూడు కీలక పరిణామాలు!

(ప్రతాప్)

**రూపాయి స్థిరత్వానికి ఆర్‌బీఐ కీలక చర్యలు!**

అంతర్జాతీయంగా డాలర్ బలపడటం, రూపాయి మారకపు విలువపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో భారతీయ రిజర్వు బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం సంస్థలకు ప్రత్యేక డాలర్ సదుపాయాన్ని ప్రకటించింది. అక్టోబర్ 12 నుంచి అమల్లోకి వచ్చే ఈ విధానం ద్వారా ఆయా సంస్థల రోజువారీ డాలర్ అవసరాలను నిర్దేశిత బ్యాంకుల ద్వారా తీర్చనున్నారు. ముడిచమురు దిగుమతుల కోసం భారీగా డాలర్లను కొనుగోలు చేయాల్సి రావడం విదేశీ మారకపు మార్కెట్‌పై ఒత్తిడి పెంచుతోంది. తాజా నిర్ణయంతో ఆ ఒత్తిడిని తగ్గించి, రూపాయి విలువలో తీవ్ర హెచ్చుతగ్గులను నియంత్రించవచ్చని భావిస్తున్నారు. తదుపరి ప్రకటన వరకు ఈ సదుపాయం కొనసాగనుంది.

**టీసీఎస్ లాభాల్లో 15 శాతం వృద్ధి!**

భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. సంస్థ నికర లాభం




గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే సుమారు 15 శాతం పెరిగి రూ. 13,884 కోట్లకు చేరుకుంది. కృత్రిమ మేధ ఆధారిత సేవల ద్వారా వార్షికీకరించిన ఆదాయం 310 కోట్ల అమెరికన్ డాలర్లకు చేరడం విశేషం. అంతర్జాతీయ మార్కెట్లలో వ్యాపార విస్తరణ, కొత్త సాంకేతిక ఒప్పందాలు సంస్థ పనితీరుకు దోహదపడ్డాయి. పోర్షే, బెస్ట్‌బై సంస్థలతో కీలక భాగస్వామ్యాలను ప్రకటించింది. వాటాదారులకు ఒక్కో షేరుపై రూ. 12 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ టీసీఎస్ ఫలితాలు భారత ఐటీ రంగంపై సానుకూల అంచనాలను పెంచాయి.

**స్టాక్ మార్కెట్లలో భారీ రికవరీ!**

వరుస నష్టాలతో సతమతమైన దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం బలంగా పుంజుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ సెన్సెక్స్ 879.09 పాయింట్లు పెరిగి 72,472.33 వద్ద ముగియగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ నిఫ్టీ 288.65 పాయింట్లు లాభపడి 22,520.45 వద్ద స్థిరపడింది. టీసీఎస్ త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా ఉండటంతో ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి. చమురు ధరల్లో కొంత తగ్గుదల కూడా మార్కెట్‌కు ఊతమిచ్చింది. ఒక్కరోజులోనే బీఎస్ఈలో నమోదైన సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.4 లక్షల కోట్లకు పైగా పెరిగింది. ఎనిమిది వారాలుగా కొనసాగుతున్న నష్టాల పరంపరకు ఈ వారంతో తెరపడింది. అయితే విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి బలహీనత, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో మార్కెట్లలో అప్రమత్తత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# త్రిజట-శత్రువుల మధ్య మానవత్వం

## అశోకవనంలో వినిపించిన ఓదార్పు స్వరం

**రామాయణంలో త్రిజట రాక్షస సమాజానికి చెందిన స్త్రీ. ఆమె రావణుని రాజ్యంలో నివసిస్తుంది; అశోకవనంలో బంధించబడిన సీత చుట్టూ ఉన్న రాక్షస స్త్రీలలో ఒకరిగా కనిపిస్తుంది. కానీ త్రిజట తన వర్గానికి చెందినవారి క్రూరత్వాన్ని అనుసరించదు. ఇతర రాక్షస స్త్రీలు సీతను బెదిరించి, రావణుని కోరికకు అంగీకరించాలని ఒత్తిడి చేస్తున్నప్పుడు ఆమె వారిని వారిస్తుంది. సీతకు ధైర్యం చెప్పి, శ్రీరాముడే విజయం సాధిస్తాడనే ఆశను కలిగిస్తుంది.**




శత్రువుల రాజ్యంలో, తన చుట్టూ క్రూరత్వం ఆధిపత్యం చెలాయిస్తున్న సమయంలో మానవత్వాన్ని కాపాడుకోవడం సాధారణ విషయం కాదు. త్రిజట మంచితనం సౌకర్యవంతమైన పరిస్థితుల్లో కనిపించలేదు; ప్రమాదకరమైన వాతావరణంలో వెలుగుచూసింది. అందువల్ల ఆమె పాత్ర కరుణతో పాటు నైతిక ధైర్యానికి కూడా ప్రతీకగా నిలుస్తుంది.

**వర్గ విధేయత కంటే సత్యానికి విధేయత**

త్రిజటకు సీతతో రక్తసంబంధం లేదు. ఆమెకు సహాయం చేయడం వల్ల ఎటువంటి వ్యక్తిగత లాభమూ లేదు. పైగా రావణుని నిర్ణయాన్ని వ్యతిరేకించడం వల్ల తనకే ప్రమాదం కలిగే అవకాశం ఉంది. అయినప్పటికీ నిరపరాధురాలైన సీత బాధను గుర్తించి ఆమెకు అండగా నిలిచింది.

తన వర్గానికి చెందిన వ్యక్తి చేసిన తప్పును సమర్థించకపోవడం గొప్ప నైతిక లక్షణం. చాలామంది "మనవాడు" తప్పు చేసినా అతని పక్షాన నిలుస్తారు; "పరాయివాడు" మంచి చేసినా అనుమానంతో చూస్తారు. త్రిజట ఈ సంకుచిత భావనను అధిగమిస్తుంది. మానవత్వానికి జాతి, వర్గం, రాజ్యం అనే సరిహద్దులు ఉండవని నిరూపిస్తుంది.

**విభజిత సమాజానికి అవసరమైన పాఠం**

నేటి సమాజం కులం, మతం, ప్రాంతం, భాష, జాతి, రాజకీయ పార్టీ వంటి గుర్తింపుల ఆధారంగా తీవ్రమైన విభజనలను ఎదుర్కొంటోంది. ఒక వ్యక్తి చెప్పిన మాట నిజమా కాదా అని పరిశీలించడానికి బదులుగా, అతను ఏ వర్గానికి చెందినవాడో చూసి స్పందిస్తున్నాం. సామాజిక మాధ్యమాల్లో రాజకీయ విభేదాలు వ్యక్తిగత శత్రుత్వాలుగా మారుతున్నాయి.

మన వర్గానికి చెందినవారు చేసిన హింసను చిన్నదిగా చూపడం, ప్రత్యర్థుల చిన్న తప్పును పెద్ద నేరంగా చిత్రించడం న్యాయాన్ని బలహీనపరుస్తుంది. త్రిజట మనకు వ్యక్తుల గుర్తింపును కాకుండా చర్యల నైతికతను పరిశీలించాలని సూచిస్తుంది. న్యాయం అందరికీ ఒకే విధంగా వర్తించినప్పుడే సమాజంలో విశ్వాసం ఏర్పడుతుంది.

**బాధితుడికి ఒక్క మాట కూడా బలం**

బాధలో ఉన్న వ్యక్తికి ప్రతిసారీ పెద్ద ఆర్థిక సహాయం అవసరం ఉండకపోవచ్చు. కొన్నిసార్లు అతని మాటలను నమ్మే ఒక మనిషి, ధైర్యం చెప్పే ఒక స్వరం, పక్కన నిలిచే ఒక సహచరుడు అవసరం. అశోకవనంలో ఒంటరిగా ఉన్న సీతకు త్రిజట మాటలు ఆశను అందించాయి.

ఉద్యోగస్థలంలో వేధింపులకు గురైన మహిళకు మద్దతు ఇవ్వడం, కులవివక్షను ఎదుర్కొంటున్న విద్యార్థి పక్షాన మాట్లాడటం, వృద్ధుల బాధను వినడం, మానసిక నిరాశలో ఉన్న స్నేహితుడికి తోడుగా ఉండటం--- ఇవన్నీ ఆధునిక త్రిజటలు చేయగల మానవీయ కార్యాలు.

**మౌనం తటస్థత కాదు**

అన్యాయం జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండటం ద్వారా మనం సమస్యకు దూరంగా ఉన్నామని భావించవచ్చు. కానీ బాధితుడి దృష్టిలో ఆ మౌనం అన్యాయం చేసే వ్యక్తికి పరోక్ష మద్దతుగా కనిపిస్తుంది. త్రిజట మౌనాన్ని ఎంచుకోలేదు. తాను చేయగలిగినంతగా బెదిరింపులను అడ్డుకొని సీతకు ధైర్యం చెప్పింది.

**చీకటిలో వెలిగే కరుణాదీపం**

మానవత్వం అంటే మనకు ఇష్టమైనవారికి మాత్రమే సహాయం చేయడం కాదు. మన వర్గానికి చెందని వ్యక్తికి, ప్రత్యర్థిగా భావించబడుతున్నవారికి కూడా న్యాయం చేయగలగడం. శత్రువుల మధ్య నివసిస్తూ బాధితురాలి పక్షాన నిలిచిన త్రిజట, వ్యక్తిగత అంతరాత్మ సామూహిక క్రూరత్వాన్ని ఎదిరించగలదని నిరూపించింది.

ప్రపంచం మొత్తం మారేవరకు ఎదురుచూడాల్సిన అవసరం లేదు. చీకటి వాతావరణంలో ఒక మనిషి వెలిగించే కరుణాదీపం కూడా బాధితుడికి ఆశను ఇస్తుంది. అదే త్రిజట పాత్ర అందించే శాశ్వత సందేశం.



**ప్రొఫెసర్ విశ్వేశ్వర రావు చెనమల్లు**

# బొమ్మల కొలువుకు వేళాయెరా!

సనాతన ధర్మంలో సనాతన సంప్రదాయాలలో దసరా పండుగ అత్యంత మహిమాన్వితమైనది. చిన్నవారి నుంచి వృద్ధుల వరకు ఎంతో నిష్టగా సరదాగా జరుపుకునే ఉత్సవం దసరా పండుగ. ఈ దసరా నవరాత్రులలో అమ్మవారి యొక్క ప్రత్యేక అలంకరణలు పూజలు నైవేద్యాలతో పాటు బొమ్మల కొలువు అనే ప్రక్రియ సనాతన ధర్మం లో ఉన్న ముఖ్యమైన ప్రక్రియ. మన సంప్రదాయాలలో అత్యంత విలువైన సంపద తాత ముత్తాతల కాలం నుండి వస్తున్నటువంటి కొన్ని వస్తువులు ముఖ్యమైనవి. ఆ వస్తువులలో భాగంగా మన తాతయ్య బామ్మల కాలంలో ఉండే బొమ్మలు దగ్గర నుంచి మన ఇంట్లో ప్రస్తుతం ఉన్నటువంటి బొమ్మల వరకు ఈ బొమ్మల కొలువులు పెట్టడానికి ఆసక్తి చూపుతాము. అప్పుడు ఉన్నటువంటి సంస్కృతి అప్పుడున్నటువంటి చేతి పని ఆ బొమ్మలలో స్పష్టంగా కనిపిస్తూ ఉంటాయి. బొమ్మల కొలువు పెట్టడం వలన పిల్లల్లో ఆనందం పండుగ వాతావరణం శుభ్రం చేసే విధానం ఒకరికి ఒకరు ఇచ్చిపుచ్చుకుని పంచుకొనే విధానము సంతోషంగా ఉండడానికి కారణం అవుతాయి.



**బొమ్మలు కొలువులో ఉండే అర్థము - అంతరార్థము**

మన గృహంలో ఉండే సనాతన విగ్రహాలు బొమ్మలు, జంతువులు బొమ్మలు, పక్షుల బొమ్మలు అన్నింటిని ఈ కొలువులో అలంకరిస్తాము. దేవుళ్ళని జంతువులని పక్షులని కలిపి అలంకరించడం వలన కొలువు తీర్చడం వలన అందరూ సమానమే అనే అర్థాన్ని తెలుపుతుంది. ఈ బొమ్మలకు లో పెట్టిన తొమ్మిది రోజులు సాయంత్రం సమయంలో చుట్టుపక్కల వారిని, బంధువులని, తాంబూలానికి పిలవడం బొట్టుపెట్టి పండ్లు, తాంబూలం అందించడం వలన ఒకరికొకరు సంఘీభావంతో ఉండాలని సూచిస్తుంది. ఇలా తొమ్మిది రోజులు గడపడం వలన తెలియలేని విషయాలను తెలుసుకుంటూ పెద్దవారి మన్నలను పొందుతూ దీవెనలు పొందితే ధర్మాన్ని రక్షించిన వారిమి అవుతాము అని ప్రతీక. శరన్నవరాత్రి సందర్భంలో ఏ ఏ ఆడపిల్లలయితే వినయ విధేయతలతో సంప్రదాయంతో ఇటువంటి కొలువును ఉంచి ఇంటిని అలంకరించి అందరి దీవెనలు పొందుతారు ఆ అమ్మవారి దీవెనలు కూడా లభిస్తాయి అనడంలో అతిశయం లేదు. ఈ సమయంలో సాయంత్రం వేళ ముత్తైదువులు మన ఇంటికి వస్తే సాక్షాత్తు అమ్మవారు వచ్చినట్లే భావించి చక్కటి వారి కాళ్ల పాదాలకు పసుపు రాసి, నుదుటన బొట్టు ఉంచి వారికి కూడా తాంబూలం ఇవ్వడం శ్రేయస్కరం.

**బొమ్మల కొలువు ను ఏ విధంగా పెట్టాలి**

సాధారణంగా బొమ్మలను కొలువులో బొమ్మలు పెట్టడం అంటే అలంకరించడంగా అందరూ భావిస్తారు. కానీ ఇది అలంకరణతో పాటు తెలుసుకోవలసిన అంతర్గత విషయాలను కూడా నిమిడీకృతం చేసి ఉంచింది. ప్రధానంగా బొమ్మల కొలువు అలంకరించే సమయంలో తొమ్మిది మెట్లను ముందుగా సిద్ధం చేసుకోవాలి.

1. క్రింది మూడు మెట్లలో జంతువుల, పక్షులు ప్రకృతికి సంబంధించిన బొమ్మలను కొలువు తీర్చి అలంకరించాలి. దీని ద్వారా మనిషి ప్రకృతిని ఆరాధించాలి అని తెలుసుకుంటాడు. దీనిని తమ గుణంలో అలంకరణగా భావిస్తారు ప్రకృతి ఎప్పుడు నిశ్చలంగా నమ్మకంగా సజావుగా ప్రశాంతంగా సాగుతుంది అని భావించి దీనిలో అలంకరణ చేస్తారు.

2. మధ్య మూడుమెట్లలో మానవ జీవితానికి సంబంధించిన రాజులు పరిపాలించిన విధివిధానాలనూ , ఘట్టాలనూ,వివాహ యజ్ఞ యాగాది క్రతువులకు సంబంధించిన వివిధ రకాలైన బొమ్మలను అలంకరించి కొలువు తీర్చాలి. మన సంసారిక జీవితంలో ఇవన్నీ ఘట్టాలు మన బాధ్యతల్ని మనం స్వీకరిస్తూ సజావుగా నిర్వర్తించాలి అని దీని అంతరార్థం. ఇది రజోగుణానికి సంబంధించినటువంటిది. చలనం కోరిక వివిధ రకాలైన ఆలోచనలు మానవ జీవితంలో అన్ని సర్వసాధారణం అని తెలుపుతూ దీనిలో అలంకరణగా చేస్తారు.

3. పైన మూడు మెట్లలో గురువులు, దేవతా, దేవుళ్ళు, దశావతారాలతో కూడిన అవతార విగ్రహాలు, అలంకరించి కొలువు తీర్చాలి. మనిషి ఎప్పటికైనా చేరుకునేది దేవుడు దగ్గరకు అని తెలుసుకోవడం దీని యొక్క ముఖ్య ఉద్దేశం. ఇది సత్వ గుణానికి సంబంధించినటువంటిది. జ్ఞానం ప్రశాంతత సమతుల్యత కష్టం నష్టం అన్ని ఒకటే అని అర్థం చేసుకునే విధానంలో దీనిలో అలంకరిస్తారు.

శరన్నవరాత్రులలో ఈ విధంగా మానవ జీవితంతో ముడిపడిన మూడు గుణాలకు సంబంధించిన సత్వ, రజో,తమో గుణాలు ను మూడు భాగాలుగా తొమ్మిది మెట్లగా విభజన చేసి మంచి సనాతన సంప్రదాయాన్ని అందరికీ తెలియజేసే విధంగా చక్కటి బొమ్మలతో కొలువును తీర్చిదిద్దుతారు. ఈ బొమ్మలకు నిత్యం వేకువజామున, ప్రదోషకాలంలో సంధ్య దీపాన్ని కూడా పెట్టి ఆ రోజు ఏ అలంకరణ అయితే అమ్మవారికి చేస్తారో ఏ నివేదనైతే చేస్తారో కొలువులో ఉన్న అమ్మవారి విగ్రహానికి కూడా అటువంటి విధంగానే చేయడం ప్రతీక. దీనివలన గృహం సకల సంపదలతో నిత్యం దేదీప్యమైన కాంతులతో సోబిల్లుతూ ఉంటుందని మన సనాతన ధర్మం మనకు తెలియజేస్తున్నది. తప్పకుండా అందరూ ఈ బొమ్మల కొలువులను అలంకరించి,ఇటువంటి సనాతన ధర్మాచరణ మన ముందు తరానికి తెలుపుతూ తెలియజేస్తూ... అందరికీ ముందుగా శరన్నవరాత్రి శుభాకాంక్షలు తో

**రచన**
**ఏ. బాల సౌజన్యకుమారి,**
**తెలుగు ఆచార్యులు,**
**నంది అవార్డు గ్రహీత,**
**ఆధ్యాత్మికవేత్త, ప్రవచన కర్త**

## స్వర్ణముఖి నది తీరంలో కర్మక్రియల మండపాన్ని అభివృద్ధి చేయాలి

### మహాలయ అమావాస్య సందర్భంగా భక్తుల ఇబ్బందులు.. బీజేపీ సీనియర్ నాయకుడు గరికపాటి రమేష్ బాబు వినతి

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 , జయ జయహే**



శ్రీకాళహస్తి పట్టణంలోని దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని స్వర్ణముఖి నది తీరాన ఉన్న కర్మక్రియల మండపాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు గరికపాటి రమేష్ బాబు సంబంధిత అధికారులను కోరారు. మహాలయ అమావాస్య సందర్భంగా పితృదేవతలకు తర్పణాలు, పిండప్రదానాలు నిర్వహించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ప్రస్తుత మండపం సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన పేర్కొన్నారు.మహాలయ అమావాస్యను పురస్కరించుకుని శనివారం శ్రీకాళహస్తి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలు, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వర్ణముఖి నది తీరంలో పితృదేవతలకు తర్పణాలు, పిండప్రదానాలు, బ్రాహ్మణులకు దానధర్మాలు నిర్వహించారు. అయితే, ఎన్నో సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన కర్మక్రియల మండపం భక్తుల సంఖ్యకు సరిపోకపోవడంతో పలువురు నది ఒడ్డునే మండుటెండలో గొడుగులు వేసుకుని పితృకార్యాలు నిర్వహించాల్సి వచ్చిందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా గరికపాటి రమేష్ బాబు మాట్లాడుతూ, హిందూ సంప్రదాయం ప్రకారం భాద్రపద మాసంలో వచ్చే మహాలయ పక్షాలు పితృదేవతలకు తర్పణాలు, పిండప్రదానాలు సమర్పించేందుకు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని తెలిపారు. పితృదేవతలు మరణించిన తిథిని అనుసరించి మహాలయ పక్షాల్లో ఆయా రోజుల్లో పితృకార్యాలు నిర్వహిస్తారని, తిథి తెలియని వారు మహాలయ అమావాస్య రోజున ఈ కార్యక్రమాలు చేపడతారని వివరించారు.శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పితృకార్యాలు నిర్వహిస్తుంటారని, ముఖ్యంగా మహాలయ అమావాస్య, సంక్రాంతి వంటి పర్వదినాల్లో భక్తుల రద్దీ గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భక్తుల అవసరాలకు అనుగుణంగా కర్మక్రియల మండపాన్ని విస్తరించి, తగిన నీటి సౌకర్యం, నీడ, కూర్చునే ఏర్పాట్లు, పరిశుభ్రత, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు.స్వర్ణముఖి నది పవిత్రతను కాపాడుతూ, పితృకార్యాల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని గరికపాటి రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు.

# వరుస దొంగతనాలు-ఆందోళనలో ప్రజలు

**దేవరాపల్లి, అక్టోబర్ 10 జయ జయహే**

గ్రామాల్లో, మండల కేంద్రంలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తాళం వేసిన ఇళ్లను, ఆలయాలను లక్ష్యంగా చేసుకుని దొంగలు రెచ్చిపోతుండటంతో గ్రామస్థులు రాత్రి వేళల్లో నిద్రపోవాలన్నా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పోలీసులు గస్తీని పెంచి, నిందితులను త్వరగా పట్టుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మండలంలోని ఎం. అలమండ గ్రామంలో తాళాలు వేసి ఉన్న ఇంట్లో జరిగిన చోరీ స్థానికులను ఆందోళనకు గురి చేసింది. వివరాల్లోకి వెళితే ఎం.ఆలమండ మెయిన్ రోడ్ లో ఎస్ బి ఐ బ్యాంక్ కి సమీపంలో బోగవిల్లి సూర్యనారాయణ, రాజేష్ వీరు ఉద్యోగరీత్యా విశాఖలో ఉండడంతో ఇంటిని తాళాలు వేసి స్థానికంగా ఉండే మొల్లేటి పార్వతి, డి.ఎన్. మూర్తి, పి. సూర్యనారాయణలకు ఇంటి బాధ్యత అప్పగించారు. అయితే ఈ నెల ఐదో తేదీ మధ్యాహ్నం ఇంట్లోకి వెళ్లి చూడగా గది తలుపులు తెరిచి ఉన్నట్టు పి.సూర్యనారాయణ గమనించారు. దీంతో డిఎన్ మూర్తి, పార్వతులకు తెలియజేశారు. గదిలో భద్రపరిచిన విలువైన ఇత్తడి సామాలు, ధాన్యం చోరీకి గురైనట్టు గుర్తించారు. విషయాన్ని ఇంటి యాజమాన్యులైన సూర్యనారాయణ, రాజేష్ లకు ఫోన్లలో తెలియజేయడంతో వారు దేవరాపల్లి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ వి. సత్యన్నారాయణ ఆదేశాల మేరకు ఏఎస్ఐ ప్రసాదు, కానిస్టేబుల్ చంద్రశేఖర్ మంగళవారం అలమండలో దొంగతనం జరిగిన ఇంటిని, చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించి, ఇంటి బాధ్యతలు



చూస్తున్నా వారి నుంచి వివరాలు సేకరించారు. చోరీకి అవకాశం ఉన్న మార్గాలను పరిశీలించారు. అనుమానితుల కదలికలపై సమాచారం ఇవ్వాలని లేదంటే, పోలీస్ డాగ్స్ తో తనిఖీలు నిర్వహించి నిందితులను గుర్తిస్తామని హెచ్చరించారు. అలాగే ఇటీవల గ్రామంలో రహదారుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్న రోజే పట్టపగలు మరొక ఇంటి తాళాలు దొంగలు పగులగొట్టారు. వ్యవసాయ బోర్లు మోటార్లు, విద్యుత్తు వైర్లు, తామరబ్బ, సోంపురం, సీతంపేట, వాకపల్లి, నాగయ్యపేట, గ్రామాలలో కూడా మోటార్లు విద్యుత్ వైర్లు దొంగిలించారు. వరుసగా జరుగుతున్న దొంగతనాలుతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో పోలీసులు గస్తీని ముమ్మరం చేసి అనుమానితులను, చోరీకి పాల్పడే గంజాయి బ్యాచ్, చెత్త ఏరుకునే వారిని గుర్తించి దొంగతనాలను కట్టడి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# బీసీల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

**స్థానిక సమరంలో బీసీల బలోపేతానికి కృషి**

**కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షదాయకం**

**మాడుగుల నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కర్రి సింహాద్రి అప్పలనాయుడు**

**దేవరాపల్లి, అక్టోబర్ 10, జయ జయహే :**



ఎస్ సి, ఎస్టీలకు రాజ్యాంగ బద్ధ హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లకుండా బీసీల సంక్షేమానికి 34 శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా కల్పించడం చాలా గొప్ప హర్షదాయకమని తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కర్రి సింహాద్రి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని నాగయ్యపేట పంచాయతీ స్వగ్రామం సీతంపేటలో శనివారం స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అంటేనే పేదల పార్టీ అని, పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా నాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్న నందమూరి తారక రామారావు, నేడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీల సంక్షేమానికి కృషి చేస్తున్న తరుణంలో బీసీల ఎదుగుదల ఇష్టం లేని వైకాపా హైకోర్టు, సుప్రీంకోర్టులో అడ్డుపడి బీసీలకు నష్టం కలిగే విధంగా వ్యవహరిస్తున్న తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. కోర్టు వ్యవహారాలకు సంబంధం లేకుండా బీసీలు అంటేనే పేదలని గుర్తించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేసేందుకు 34% రిజర్వేషన్ను పార్టీపరంగా కల్పించి వారి అభ్యున్నతకు కృషి చేస్తున్న తెలుగుదేశం పార్టీకి బీసీలంతా ఐక్యతగా రానున్న స్థానిక ఎన్నికల్లో బలంగా నిలబడి పార్టీ బలోపేతానికి, స్థానిక ఎన్నికల విజయాలకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# అచలేశ్వరస్వామి శివ పీఠంలో దేవి శరన్నవరాత్రులు ప్రారంభం నేడు

**దేవరాపల్లి, అక్టోబర్ 10, జయ జయహే :**



మండలంలోని వేచలం గ్రామంలో అచలేశ్వర స్వామి శివ పీఠంలో దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు గురు స్వామి కె. వెంకటరావు శనివారం పేర్కొన్నారు. దేవి శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారు బాల త్రిపురసుందరి దేవి, మొదటి రోజు గాయత్రి దేవి, రెండో రోజు అన్నపూర్ణా దేవి, మూడో రోజు కాత్యాయని దేవి, నాలుగో రోజు మహాలక్ష్మి దేవి, ఐదో రోజు లలితా త్రిపురసుందరి దేవి, ఆరో రోజు మహా చండి దేవి, ఏడో రోజు సరస్వతీ దేవి, (మూలా నక్షత్రం), ఎనిమిదో రోజు దుర్గా దేవి, తొమ్మిదో రోజు మహిషాసురమర్ధిని దేవి, పదో రోజు రాజరాజేశ్వరీ దేవి (విజయదశమి), పదకొండో రోజున అమ్మవారు అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది విశేషంగా భవాని మాలాధారణ ధరించి భక్తులు అమ్మవారి సేవలో నిమగ్నలై తరించేందుకు ఈ శరన్నవరాత్రులలో భక్తులు విశిష్టమైనటువంటి ఉపవాసాలతో అమ్మవారిని రోజుకు ఒక అవతారంలో దర్శించేందుకు సిద్ధపడుతున్నారన్నారు.




# ఊపిరికి భరోసా.. యశోద వైద్యం!

**ఊపిరితిత్తుల మార్పిడి, ఎక్మో సేవల్లో అత్యాధునిక చికిత్స**

**రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 10**

ప్రాణాపాయ స్థితిలో ఉన్న తీవ్ర శ్వాసకోశ రోగులకు హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ అత్యాధునిక వైద్య సేవలతో అండగా నిలుస్తోంది. ఊపిరితిత్తుల మార్పిడి, ఎక్మో , క్రిటికల్ కేర్ విభాగాల్లో ఆధునిక సాంకేతికతతో కూడిన చికిత్సను అందిస్తూ సంక్లిష్ట కేసుల్లో కీలక వైద్య సేవలందిస్తోంది.కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కట్రగడ్డ ఆధ్వర్యంలో ఊపిరితిత్తుల వ్యాధుల నిర్ధారణ, మార్పిడి చికిత్సకు ముందు, తర్వాత రోగుల సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్నారు. చీఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ వినీత్ ఐలాపురం పర్యవేక్షణలో రోగుల భద్రత, వైద్య విభాగాల సమన్వయం, నాణ్యమైన చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.తీవ్ర శ్వాసకోశ వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు ఆధునిక వైద్య విధానాల ద్వారా మెరుగైన చికిత్స అందించడమే లక్ష్యంగా ఆసుపత్రి పనిచేస్తోంది. ఈ వైద్య సేవలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ బాల వీరభద్ర నల్లం, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ ఎం.డి. షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# కోలాహలంగా కృతజ్ఞతార్పణల పండగ

**విశాఖపట్నం, అక్టోబర్ 10, జయ జయహే**

క్రైస్తవుల కృతజ్ఞత, అర్పణలు వారి సమృద్ధికి సంకేతాలుగా నిలిచాయి. కరెన్సీ స్థానే ప్రత్యేకంగా ముద్రించిన కూపన్లు కొనుగోలుకు వినియోగించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కొన్ని గంటలపాటు 'క్వర్క్ మెమోరియల్ బాప్టిస్ట్ (క్యూఎంబీ)చర్చ్ ముంద్రించిన కూపన్లు అక్కడ మారకపు ద్రవ్యం (నగదు)గా చెలామణయ్యాయి. మద్దిలపాలెం-ఆశీలుమెట్ట రహదాలో ఉన్న రేసపువానిపాలెం క్వర్క్ మెమోరియల్ బాప్టిస్టు (క్యూఎంబీ) చర్చ్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన 78 వ 'కృతజ్ఞత, అర్పణ పండుగ - 2026' ఆద్యంతం కోలాహలంగా జరిగింది. 1948లో చర్చ్ స్థాపించినప్పట్నుంచీ ఏటా అక్టోబరు నెల రెండో శనివారం కృతజ్ఞతార్పణల పండుగ నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. ప్రాచీన కాలపు ఇశ్రాయేలీయుల వేడుకను ఇప్పటికీ క్రమం తప్పకుండా విశాఖలోని క్యూఎంబీ చర్చ్ దీన్ని ఆచరించడం వరుసగా ఇది 78 సవత్సరం. ఈ విశిష్ట సంబరానికి ముస్తాబైన స్టాళ్లను ముఖ్య అతిథి సీఆర్పీఎఫ్ 198 వ బెటాలియన్ (పటాలము) రెండో కమాండెంట్ పి. కిషోర్ తన సతీమణి సుష్మ తో కలసి రిబ్బన్ కత్తిరించి



ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన స్తుతి ఆరాధనకు సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ జి. స్టీవెన్ పీటర్ సారథ్యం వహించారు. క్యూఎంబీ సంఘం సాగర్ నగర్ బ్రాంచి కాపరి మట్టా డానియెల్ వర ప్రసాద్ వాక్యోపదేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికర్తయైన దేవుడు భూమ్మీద మానవాళికి, సమస్త జీవ రాశులకు సమృద్ధిగా ప్రకృతి వరప్రసాదంగా ఇచ్చిన ఆహారం, పాడి, పంట, గాలి, వెతురు, ఇతర వనరులు, వసతులు, ఆయు-ష్షు, ఆరోగ్యం ప్రసాదించినందుకు సష్టికర్తకు స్తుతి చెల్లిస్తూ ఈ ప్రాచీనమైన కృతజ్ఞత పండగ (హార్వెస్ట్ ఫెస్టివల్) ఆవిర్భవించిందన్నారు. సమస్తమైన జీవరాశులో మానవుణ్ణి ఉన్నతంగా కాపాడటాన్ని బట్టి ప్రతిఒక్కరూ కృతజ్ఞత కలిగి దేవునికి తమ సమర్పణు చెల్లించాల్సిన ఆవశ్యకతను రెవ. మట్టా డానియెల్ వరప్రసాద్ తన సందేశంలో వివరించారు. సంఘ అధ్యక్షులు తాడి ఐజక్ మాట్లాడుతూ గత 78 సవత్సరాలుగా సంఘంలో ఈ కృతజ్ఞతార్పణల పండగ జరిపిస్తున్నామన్నారు. సంఘ కార్యదర్శి కాటపల్లి ఇజ్రాయిల్ తన సందేశంలో సంఘ సభ్యులు పండించిన, వండి తయారు చేసి, తెచ్చిన వస్తువులు, ఆహారపదార్థాలను సంఘ సభ్యులే కొనుగోలు చేయడం, ఆ క్రయ విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయాన్నంతటినీ సంఘ అవసరతలు, అభివృద్ధి, సేవా పరిచర్యలకు ఉపయోగించడం జరుగుతుందన్నారు. కోశాధికారి జి. భాస్కర రావు, ఎగ్జిక్యూటివ్ ఆగ్జిలరీ సభ్యులు సాల్మన్ విజయ్ కుమార్, సీహెచ్. కుమార్ ప్రకాష్ ఇతర కార్యవర్గ సభ్యుల పర్యవేక్షణలో ఫెస్టివల్ ఆద్యంతం ఉల్లాసంగా ఉత్సాహంగా క్రమశిక్షణతో జరిగింది. విశేష సంఖ్యలో హాజరైన సందర్శకులలో క్యూఎంబీ చర్చి సెల్లార్ ఒక రద్దీ మార్కెట్ షాపింగ్ మాల్ ను తలపించింది.



# కొయ్యూరులో శరన్నవరాత్రి ఉత్సవాలు సిద్ధమైన కనకదుర్గ ఆలయం

**కొయ్యూరు : (జయ జయహే న్యూస్) అక్టోబర్ 11,**

కొయ్యూరులోని కొండపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం దసరా శరన్నవరాత్రులకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.నవరాత్రులను పురస్కరించుకుని ఆలయ కమిటీ, గ్రామ భక్తులు ఆలయాన్ని శుభ్రం చేసి, పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు ఎరుపు వస్త్రాలు ధరించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అక్టోబర్ 11 నుండి 20 వరకు 9 రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ప్రతిరోజూ అమ్మవారికి ఒక అవతారంలో అలంకరణ, అభిషేకాలు, కుంకుమార్చనలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు.




# ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న విద్యాస్ వికాస్ ఉపాధ్యాయులు

**ఒకే పాఠశాలకు చెందిన ముగ్గురికి అవార్డులు**

**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబర్ 10, జయ జయహే**

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు 2026 సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు నూతనపాటి గురు ప్రసాద్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు దేగ రాజశేఖర్, తెలుగు ఉపాధ్యాయిని పి. శోభ ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరిని ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. విద్యారంగంలో వారు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వనిత రెడ్డి మాట్లాడుతూ, ఒకే పాఠశాలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు పురస్కారాలు అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. అవార్డు గ్రహీతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పురస్కార గ్రహీతలు పాఠశాల కరస్పాండెంట్ విద్యా ప్రకాష్ రెడ్డికి, ఏ.పి.పి.ఎస్.ఏ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.




# బాలికల విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

**బాల్యవివాహాలను అరికట్టాలి**

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 , జయ జయహే**

శ్రీకాళహస్తి బాలికలు విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. శ్రీకాళహస్తి రూరల్ మండలం బీవీ పురం గిరిజన కాలనీలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, క్రై సంస్థ సహకారంతో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, బాలికలు చదువుపై దృష్టి సారించి అన్ని రంగాల్లో రాణించాలని, బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళా కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ, బాల్యవివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటాయని తెలిపారు. బాలికల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం బాలికల విద్యను ప్రోత్సహించడం, బాల్యవివాహాలను అరికట్టడంపై ప్రతిజ్ఞ చేసి, అవగాహన నినాదాలతో మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కో-కన్వీనర్లు రామచంద్ర, వెంకటేష్, మురుగయ్య, ఎస్ఎంసీ కమిటీ సభ్యుడు చలపతి, గ్రామస్తులు, బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గర్భిణీలు బలమైన పౌష్టికాహారం తీసుకోవాలి

**ప్రభుత్వ వైద్యాధికారిణి డి. వనజ**

**దేవరాపల్లి, అక్టోబర్ 10, జయ జయహే :**

గర్భిణీలు బలమైన పౌష్టికాహారం తీసుకోవడం వలన పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉంటుందని దేవరాపల్లి పి హెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ డి. వనజ అన్నారు. శనివారం ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 48 మంది గర్భిణీలకు పరీక్షలు చేసి, అనంతరం వారిని సమావేశపరిచి గర్భిణీ సమయంలో వారు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి తెలియజేసి, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ సి వైద్య బృందం, తదితరులు పాల్గొన్నారు.





## చోడవరంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం గుర్తింపు

**చోడవరం, అక్టోబర్ 10, జయ జయ హే**

చోడవరం పట్టణంలోని ఐటీ కాలనీ సమీపంలో ఓ షావుకారి ఇంట్లో పేదలకు ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న హెచ్ ఆర్ ఈ సి ఐ సభ్యులు సీఎస్డీటీ అధికారికి ఫోన్ ద్వారా విషయం తెలియజేసి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రభుత్వ రెవెన్యూ సిబ్బందితో కలిసి అధికారులు సంబంధిత ఇంటిని తనిఖీ చేయగా, సుమారు 150 కిలోలకు పైగా రేషన్ బియ్యం నిల్వ ఉన్న బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు.ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, తరలింపులపై హెచ్ ఆర్ ఈ సి ఐ సభ్యులు అప్రమత్తంగా వ్యవహరించి, సంబంధిత అధికారులకు సమాచారం అందించడం అభినందనీయమన్నాడు. ఇలాంటి అక్రమాలను అరికట్టేందుకు సభ్యులందరూ ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధ్యతాయుతంగా ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమంలో చొరవ చూపిన అనకాపల్లి జిల్లా హ్యూమన్ రైట్స్ ఎన్ఫోర్స్మెంట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ అబ్రహాం , మహిళా విభాగం ప్రతినిధులు, ఆషా,జ్యోతి స మణికంఠ లను అభినందించారు.చోడవరం సి ఎస్ డి టి భాస్కరరావు మాట్లాడుతూ సావుకారి పై 6ఏ కేసు నమోదు చేశామని పట్టుకున్న బియ్యం సీజ్ చేసి రైస్ గోడౌన్ పంపినట్లు తెలిపారు.



## కోటి 76 లక్షల అభివృద్ధి పనులకు ఎంపీ శ్రీకారం

**మాడుగుల, అక్టోబర్ 10,జయ,జయ,హే**

మాడుగుల మండలంలో కోటి 76 లక్షల విలువైన అభివృద్ధి పనులకు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ శనివారం శ్రీకారం చుట్టారు. దానిలో భాగంగా మాడుగుల మండలం శంకరం పంచాయతీ చిట్టిగెడ్డ గ్రామంలో పల్లె పండుగ 3.0 పథకంలో భాగంగా కోటి రూపాయలతో నిర్మించనున్న వివిధ రోడ్లుకి ఎంపీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణతో కలసి శంకుస్థాపన చేశారు.అలాగే మాడుగుల పంచాయతీ రామచంద్రాపురం గ్రామంలో 30 లక్షలు రూపాయలతో, ఎం కృష్ణాపురం గ్రామంలో46 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీరు ఇంటింటికి కొళాయి పథకాలను అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ తో కలిసి నియోజకవర్గ శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు , రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి వి జి కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, ఏ ఎం సీ చైర్మెన్ పి అప్పలరాజు, టిడిపి నాయకులు ఎన్ సన్యాసిరావు,పి రమేష్,పి లక్ష్మీనారాయణ, జిల్లా , మండలం ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్లకు బోరు మోటారు విద్యుత్ సౌకర్యం కల్పించండి

**మాడుగుల అక్టోబర్ 10 జయ జయహే**



సభ్యులు సీఎం రమేష్ గ్రామాల్లో పరిశుద్ధమైన మంచిని అందించేందుకు వాటర్ ప్లాంట్ లో మంజూరు చేయడం అభినందియమని ఏం కోడూరు మాజీ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు అన్నారు. అయితే అదే సమయంలో ప్లాంట్ ఏర్పాటు కావాల్సిన బోరు, మోటారు, విద్యుత్ సౌకర్యం కూడా అవసరం అన్నారు. అయితే వీటిని పంచాయతీ నిధుల నుంచి ఏర్పాటు చేసుకోమని చెప్పినప్పటికీ పంచాయతీల్లో తగినంత నిధులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఎంపీ ఆనిధులను కూడా మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి

**చోడవరం, అక్టోబర్ 10, జయ జయ హే**




చోడవరం మండలం లో మిగిలిన 2 (ఓపెన్ కేటగిరి ) మద్యం షాప్ లకు శనివారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆధేశాల మేరకు అనకాపల్లి జిల్లా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్, ఎక్సైజు అధికారి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు స్థానిక ఎక్సైజ్ సి ఐ కె వి పాపునాయుడు తెలిపారు. షాపు ల కోసం దరఖాస్తు చేసుకొనే వారు ఈ నెల 19 అర్ధరాత్రి 12 గంటల వరకు ఆన్లైన్ విధానం లో రఖాస్తు చేసుకోగలరన్నారు. దరఖాస్తు స్వీకరణ పూర్తి అవగానే ఈ నెల 21 న అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో లాటరి నిర్వహించ బడునన్నారు.



## దసరా ఉత్సవ పోస్టర్ విడుదల

**మాడుగుల అక్టోబర్ 10 జయ జయహే**

మాడుగుల లో దయచేసి అన్న శ్రీ దుర్గా దేవి అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాల గోడ పత్రికను శనివారం ఆలయ కమిటీ విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావు, అధ్యక్షులు ఎస్వి కొండలరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు,ఆలయ కార్యదర్శి అన్నం నీడి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది శ్రీదేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 11న ఉదయం 8. 59 నిమిషాలకు కలశస్థాపనతో ఉత్సవ ప్రారంభమవుతాయని,16వ తేదీ శుక్రవారం నాడు ఉదయం మూలపూజ, రాత్రి 7 గంటలకు సాముగరిడి 20 తేది మంగళవారం విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది విజయదశమి వేడుకలు 10 రోజులు సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు శ్రీనాథు వెంకటరాజు, బి.నరశింహ మూర్తి, ఎలిశెట్టి సతీష్, ప్రసాద్, ఇల్లపు రమణ, ఎల్. సుందరరాజు, ఉగ్గిన వెంకటరావు, కొర్ని దేముడు, జొన్నపిల్లి పోతురాజు, మల్లేశ్వరరావు, సిహెచ్ గోవింద్,రాజు మోటార్ వర్కర్స్ సభ్యులు పాల్గొన్నారు.



## రూ.30 లక్షలతో ఎస్టీ కాలనీలో డ్రైనేజీ పనులకు భూమి పూజ

### హాజరైన మున్సిపల్ కమిషనర్, కూటమి నాయకులు

### ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు

**శ్రీకాళహస్తి అక్టోబర్ 10, జయ జయహే,**

పట్టణంలోని 33వ వార్డు పరిధిలో గల ఎస్టీ కాలనీలో శనివారం నూతన మురికి కాలువ (డ్రైనేజ్) నిర్మాణ పనులకు ఘనంగా భూమి పూజ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు దాదాపు రూ. 30 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులను చేపట్టారు. పట్టణ అధ్యక్షుడు జి. విజయ్ కుమార్, క్లస్టర్ ఇన్చార్జ్ కంట రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఎన్నో ఏళ్లుగా సరైన డ్రైనేజీ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమ సమస్యను గుర్తించి, తక్షణమే నిధులు మంజూరు చేయించినందుకు ఎస్టీ కాలనీవాసులు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, నాయకులు కాసరం రమేష్, యూనిట్ ఇన్చార్జ్ ఆర్ముగం, హరి, పోలూరు శ్రీనివాసరెడ్డి, రాకేష్, కన్నవరం హరిబాబు, సునీల్, షణ్ముగం, ఎమ్మెస్ రెడ్డి, మున్సిపల్ డిఈ, ఏఈ మరియు మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## నేటి నుంచి అష్టలక్ష్మి పూజలు

**మాడుగుల అక్టోబర్ 10 జయ జయహే**

మాడుగుల మండలం కస్పా జగన్నాథపురం జంక్షన్ లో వేంచేసి ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామిదేవాలయంలో శరన్నవరాత్రుల పురస్కరించుకొని ఈ నెల 11 నుంచి 20 వరకు అష్టలక్ష్మి పూజలు నిర్వహిస్తున్నట్టు దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ రాపేటి రామకొండ రావు శనివారం తెలిపారు.ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి భక్తుల గోత్రనామాల తో అష్టలక్ష్మి కుంకుమ పూజలు జరుగుతాయని అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటాదన్నారు. విజయదశమి రోజున జమ్మిచెట్టు ప్రదక్షిణ పూజలు కూడా జరుగుతాయి అన్నారు. కాబట్టి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

## దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**మాడుగుల అక్టోబర్ 10 జయ జయహే**



ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించే మాడుగుల దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ఈ నెల 11 నుంచి 20 వరకు జరిగే నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. మాడుగుల బస్టాండ్ ఆవరణలో గల శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయంలోనూ, జిసిసి వద్దగల శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో, నవ వీధిలో గల శ్రీ పోలి పిల్లమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు కుంకుమ పూజలు తోపాటు రాత్రి సంస్కృతి కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయా ఆలయ కమిటీలు ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. వీటితోపాటు మండలంలో వివిధ గ్రామాల్లో కూడా ఈ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు.



## రాష్ట్రస్థాయి బృందగాన పోటీల విజేత డిఏవీ స్కూల్

**అనకాపల్లి, అక్టోబర్ 10, జయ జయహే**

భారత వికాస పరిషత్ విశాఖపట్నం ప్రాంతం ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లిలో రాష్ట్రస్థాయి బృందగాన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అనకాపల్లికి చెందిన డీఏవీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రథమ బహుమతి సాధించగా, విశాఖపట్నంలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ ద్వితీయ బహుమతి, తునిలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ తృతీయ బహుమతి సాధించాయి. ఈ కార్యక్రమానికి డాక్టర్ కె.వి. సత్యవతి, డాక్టర్ కె. విష్ణుమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దక్షిణ భారత భారత వికాస పరిషత్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ధూళిపాళ పురుషోత్తమ శాస్త్రి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ వి.ఎస్. నారాయణ, అనకాపల్లి శాఖ అధ్యక్షుడు సామ త్రినాథరావు పాల్గొన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా అనకాపల్లికి చెందిన ప్రముఖ విద్యావేత్త, ప్రవచనకర్త, నంది అవార్డు గ్రహీత ఏ. బాల సౌజన్యకుమారి, దాడి మల్లేశ్వరి వ్యవహరించారు. మలేషియా నుంచి ప్రత్యేక ఆహ్వానితులుగా దాడి బాల, రుక్మిణి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భారత వికాస పరిషత్ మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు పిల్లా నిర్మల, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆళ్ల ఓమ్రామ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వి. రాజు, బృందగాన పోటీల కన్వీనర్ వంకాయల ఈశ్వరరావు, ఎం.ఏ.బి. వర్మ, డాక్టర్ ఎస్. నూకరాజు, కార్యదర్శి పెంటకోట రాజేష్ నాయుడు, జిల్లా గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. పోటీల నిర్వహణలో నిర్వాహకులు, వివిధ పాఠశాలల ప్రతినిధులు, పాల్గొన్న విద్యార్థులు సహకరించడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.




## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆఫీస్ నందు శనివారం ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటీ వాహనాలను పంపిణీ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మరియు పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలవాలని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల అభివృద్ధికి ప్రత్యేక పాఠశాలల ఏర్పాటు చేయడం అవసరమని అనకాపల్లి జిల్లాలో తొలి విడతగా 52 ట్రైసైకిల్ పంపిణీ చేయడం జరిగింది సందర్భంగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన దివ్యాంగుల సోదర సోదరీమణులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ అందించే సహాయ పరికరాలు వారి అవసరాలకు అనుగుణంగా ఉపయోగపడేలా చూడాలని పూర్తిగా ఇతరులపై ఆధార పడే వారి కుటుంబ సభ్యుల సహకారంతో పరికరాలు వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు మానసిక శారీరక అభివృద్ధిలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు కు నాణ్యమైన విద్యా శిక్షణ సంరక్షణ అందించేందుకు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 120 పాఠశాలలు ఏర్పాటుకు కృషి జరుగుతోందని ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి మంత్రి నారా లోకేష్ వారి దృష్టికి తీసుకెళ్లిన ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ కృషిని ఆయన అభినందించారు ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించి పిల్లల్లోని సామర్థ్యాలను వెలికి తీసేలా శిక్షణ అందించాలని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ఇంటికి పరిమితం చేయకుండా తల్లిదండ్రులు ధైర్యంగా ముందుకు తీసుకురావాలని సరైన శిక్షణా నిరంతర ప్రోత్సాహంతో వారి అభివృద్ధికి తోడ్పడవచ్చు అని అన్నారు సమాజం కూడా వారికి అండగా నిలిచి గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ నాయకులు మాడుగుల శాసనసభ్యుల బండారు సత్యనారాయణమూర్తి ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు



## వీరవిల్లిలో ఉచిత వైద్య శిబిరం

**మాడుగుల, అక్టోబర్ 10,జయ,జయ, హే**

మాడుగులమండలం వీరవిల్లి అగ్రహారంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. మండల పార్టీ నాయకులు సాయం సురేంద్ర, పాచిలి అప్పారావు ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ మెగా మెడికల్ క్యాంపులో సుమారు.,200 ,మందికి బీపీ,సుగర్ పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు.అలాగే అవసరమైన వారికి ఈ సి జి లు, నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మెలిపాక స్వామి, బీజేపీ నాయకులు స్థానిక న్యాయవాది శ్రీనాదు ప్రసాద రావు సాయం రత్న కుమారి సుంకరి కాశీ విశ్వనాథం పాల్గొన్నారు.

# ఆ ప్రస్థానం.... అప్రతిహతం



## అతడే ఒక సైన్యం... గజల్ యోధుడు శ్రీనివాస్

## దేశ , విదేశాలలో వేలాది ప్రదర్శనలతో తెలుగు జాతి ఖ్యాతి విశ్వవ్యాప్తం

## గుంటూరులో 40 వసంతాల ప్రస్తాన వేడుకలు



**విశాఖపట్నం, అక్టోబర్ 10, జయ జయహే :**

అవును...అతనొక కారణ జన్ముడు. తెలుగు జాతిని ఖండాంతర వ్యాప్తి చేసిన గొప్ప నాయకులలో ఒకరు. గజల్ శ్రీనివాస్ పేరు జగద్విదితం. ముఖ్యంగా తెలుగు వారికి పరిచయం అక్కరలేని పేరు. గజల్స్ అంటే శ్రీనివాస్ పేరు గుర్తు కు వస్తుంది. ఈనెల 14వ తేదీ గజల్ శ్రీనివాస్ జీవితంలో ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు. 50 ఏళ్ల సంగీత, 40 ఏళ్ల గజల్ గాన యాత్ర నభూతో నభవిష్యతి రీతిలో అట్టహాసంగా చేపట్టేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.

గజల్ కు సంబంధించి మన తెలుగు సాహిత్యంలోకి 1963 లో మొదటిసారిగా ప్రవేశించింది. తొలి గజల్ 1965 ఏప్రిల్ 14న ఆంధ్రప్రభ లో ప్రచురితమైంది. దాశరథి కృష్ణమాచార్య తొలి గజల్ ను రాసారు. ప్రముఖ కవి సి. నారాయణ రెడ్డి తెలుగు గజళ్ల సంపుటిని సాహితీ ప్రియులకు అందించడంతో గజల్స్ వెలుగులోకి వచ్చాయి. గజల్ శ్రీనివాస్ రంగప్రవేశంతో గజల్స్ జన బాహుళ్యంలోకి చొచ్చుకు వచ్చాయి. ఆయన ఆలపించిన గజల్స్ ప్రజలను మంత్రముగ్ధుల్ని చేసాయి. మూడుసార్లు గిన్నిస్ బుక్ రికార్డులతో తెలుగు భాషకు మధురమైన చిరునామాగా గజల్ శ్రీనివాస్



మారారు. డాక్టరేట్లు, జాతీయ,అంతర్జాతీయ పురస్కారాలతో పాటు మారిషస్ రాష్ట్రపతిచే అంతర్జాతీయ సంగీత శాంతి దూత అవార్డు అందుకున్న గజల్ మాంత్రికుడు శ్రీనివాస్. అందరి హృదయాలు ఉప్పొంగేలా సంగీత, గజల్ గానామృతంతో సమాజంలో నూతన ఒరవడి అభిషేకించడానికి తెలుగు భాషకు పట్టాభిషేకం చేస్తున్న గజల్ మాంత్రికుడు గజల్ శ్రీనివాస్. దేశ విదేశాలలో తెలుగు భాషకు ఆకాశమంత గౌరవాన్ని అందిస్తున్నారు. జ్ఞాన పీఠ పురస్కార గ్రహీత సి నారాయణరెడ్డి గజల్ మానస పుత్రుడు గజల్ శ్రీనివాస్ ఈనెల 14వ తేదీన గుంటూరు లోని భారతీయ విద్యా భవన్ లో50 ఏళ్ల సంగీత, 40 ఏళ్ళ గజల్ గాన యాత్ర మహోత్సవాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. దేశ విదేశాలలో




తెలుగు భాష ఖ్యాతిని దశ దిశలా చాటి చెబుతూ తన గజల్ గానంతో సమాజ మార్పులో నిత్యం మమేకం అవుతున్నారు. 1986 నుండి తెలుగులో గజళ్లు విశ్వ వేదికలపై ఆలపిస్తూ గజల్ గాన ప్రక్రియకు నూతన ఒరవడిని తీసుకొని వచ్చారు.గజల్ శ్రీనివాస్ కేవలం కంజీరాను సహవాయిద్యం గా చేసుకుని తానే లయాత్మకంగా వాయిస్తూ, భావ స్ఫూర్తి తో వ్యాఖ్యానం చేస్తూ తెలుగు గజల్ గానం చేయడం ఒక సంచలనమైంది. ఆయన విశిష్ట గాన ప్రక్రియకు , ప్రదర్శనలకు కోట్ల మంది ప్రజలు, అభిమానులు జేజేలు పలుకుతున్నారు.తెలుగు వారి ప్రతి గడపలో ఆయన గానం మారు మ్రోగుతోంది.తెలుగు గజల్ గానం లో మానవ సంబంధాలకు, మానవీయ విలువలకు పట్టం కడతారు.

తాత్వికత, దేశభక్తి, సామాజిక అంశాలు, మన కుటుంబం, మన ఊరి మట్టి వాసనను ఆయన గుర్తు చేస్తారు. ఆయన గజల్ గానం శ్రోతల ఆత్మయానం లా అనుభూతి కలుగుతుంది .ఆయన కొన్ని వందల గజళ్ళను వ్రాసి , స్వర పరచి గానం చేసిన గజల్ వాగ్గేయ కారుడు. కన్నడ భాషలో కూడా గజల్ గానాన్ని పరిచయం చేసిన గాయకుడు డాక్టర్. శ్రీనివాస్.. హిందీ , ఉర్దూ భాషలలో కూడా కొన్ని వందల గజళ్ళను గానం చేస్తున్న



గాయకుడు .తన గజల్ గాన పటిమను అనేక సేవా, ధార్మిక, విశ్వ శాంతి కార్యక్రమాలకు అంకితం చేసిన గాయకుడు గజల్ శ్రీనివాస్..అనాథ శరణాలయాల, వృద్ధ ఆశ్రమాల నిర్మాణాలకు ఆర్థికంగా అండగా నిల్చిన వ్యక్తిత్వం ఆయనది.నల్గొండ ఫ్లోరోసిస్ గ్రామాలలో, శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం కిడ్నీ సంబంధిత వ్యాధులున్న గ్రామాలలో ఆర్ ఓ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి మంచి నీరును అందిస్తున్న మహోన్నత వ్యక్తిత్వం డా.గజల్ శ్రీనివాస్ ది .ప్రకృతి వైపరీత్యాలు సంభ వించినపుడు బాధితుల సంక్షేమం కోసం నిధులు సేకరించి బాధితులకు అందించిన సేవా మూర్తి.మన భారత జాతి గౌరవాలైన మోగల్లు గ్రామంలోని స్వాతంత్య సమర యోధుడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్వగృహ జీర్ణోద్ధరణ, నెల్లూరు జిల్లాలోనిమహాత్మ గాంధీ స్థాపించిన పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమ జీర్ణోద్ధరణ, చంబల్ లోయ ప్రాంతంలో సాంస్కృతిక, సాహితీ, క్రీడా వికాస కార్యక్రమాలు ఆయన జీవితంలో కొన్ని అపురూప మైలు రాళ్ళు. మైసేవ్ టెంపుల్స్ భారత్ వ్యవస్థాపకుడిగా ఎన్నో పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణ, గో రక్షణ, గోశాలల పరిరక్షణ, వేద పాఠశాలలకు తోడ్పాటు , జాతీయ స్థాయి ఆశ్రమ, మఠాల , పీఠాల, సాధు సమ్మేళనాలు, తిరుపతి , పేరూరు పురాతన వకుళ మాత దేవాలయ గిరి రక్షణ , సనాతన ధర్మ పరి రక్షణ , ఎన్నో దేవాలయాలకు తెలుగులో సుప్రభాతాల గాన,.ఆడియో రూప కల్పన, అంతర్జాతీయ లఘు చలన చిత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్న సనాతన ధర్మ ప్రచారకుడు డా.గజల్ శ్రీనివాస్.గంగా హారతి లా మన జీవ నదులు గోదావరి, కృష్ణా లకు హారతి నిచ్చే సంప్రదాయానికి చరిత్రాత్మక శ్రీకారం చుట్టింది డా. గజల్ శ్రీనివాస్. చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా మంత్ర రాజ పీఠంఆద్వర్యంలో



తిరుమల సప్త గిరుల ప్రదక్షిణకు అంకురార్పణ చేసి గిరుల ప్రదక్షిణ గీతాన్ని గానం చేసి లోకార్పణం చేసిన భక్తుడు డా.గజల్ శ్రీనివాస్.గజల్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి కొన్ని వేల మందికి గజల్ రచనా సదస్సులు



నిర్వహించి గజల్ రచనలపై అవగాహన కలిగించారు.గ్రంథ ముద్రణలకు తోడ్పడి కవులకు ఆర్థిక సహాయం అందజేశారు. తొలి తెలుగు గజల్ వీడియోను రూపొందించారు. ప్రపంచ శాంతి కోసం అనేక గీతాలు వ్రాయడమే కాకుండా యుద్ధ పీడిత దేశాలలో శాంతి యాత్రలు చేశారు.2005 డా.సందీప్ పాండే నేతృత్వంలో ఢిల్లీ నుండి పాకిస్తాన్ లోని ముల్తాన్ వరకు సాగిన 1538 కిలో మీటర్ల పాదయాత్ర లో పాల్గొని శాంతి యాత్ర ఆడియో ఆల్బమ్ ద్వారా భారత దేశ శాంతి కాంక్షను తెలియ జేశారు. 2006 లో



లాహోర్ లో రెండు రోజుల శాంతి సదస్సులో పాల్గొని తదుపరి అణ్వాస్త్రాలకు వ్యతిరేకంగా లాహోర్ ప్రెస్ క్లబ్ వద్ద రెండు రోజులపాటు నిరాహార దీక్ష చేసిన ధీశాలి డా.గజల్ శ్రీనివాస్.తాలిబన్ లు సంచరించేనిత్యం బాంబుల హోరులలో ఉండే,ఆఫ్ఘనిస్తాన్ గడ్డపై అడుగు పెట్టి అడుగుగడున పర్యటించి తన గాన కార్యక్రమాల ద్వారా, ఆడియో ఆల్బమ్ల ద్వారాశాంతి ఉద్యమాలు నిర్వహిస్తూ. వస్తున్న ధైర్య శాలి డా.గజల్ శ్రీనివాస్ .ఇజ్రాయిల్ పార్లమెంట్ సెంట్రల్ హాల్లో హీబ్రూ , హిందీ భాషలలో ప్రపంచ శాంతి, అహింస , సత్యాగ్రహ సిద్ధాంతాలపై ప్రముఖుల సమక్షంలోగానం చేసిన శాంతి కాముకుడు డా.గజల్ శ్రీనివాస్. అనేక సామాజిక అంశాలపై డా గజల్ శ్రీనివాస్ గళ మెత్తారు. నీ బడి పిలుస్తోంది అన్న గీతాన్ని ఆయన ఆలపిస్తే వివిధ పాఠశాలలకు, విద్యాలయాలకు చెందిన పూర్వ విద్యార్థులు స్ఫూర్తి పొంది వారి బడులకు

వారు బాసటగానిలబడదం , కొన్నివందల బదులు రూపు రేఖలు మారి పోయాయి. ఇది గజల్ శ్రీనివాస్ గాన ప్రస్థానం లో ఒక మరపురాని ఘట్టం. పర్యావరణం , మాదక ద్రవ్యాలు, ట్రాఫిక్ నిబంధనలు, స్వచ్ఛ భారత్, నో ప్లాస్టిక్, అవయవ దానం, స్వదేశీ జాగరణ ఇలా ఎన్నో అంశాలపై ఆయన అవగాహనా గీతాలు గానం చేసి విడుదల చేసారు.ఒకే సంవత్సరంలో సనాతన ధర్మం లో అపురూపమైన. కవిత్రయ విరచిత ఆంధ్ర మహా భారతం, పోతన భాగవతం, గేయ రామాయణం , సంపూర్ణ శ్రీమద్ భగవద్గీత లను గానం చేసిన కృషీ వలుడు డా.గజల్ శ్రీనివాస్ .ధర్మం గర్వించేలా శ్రీమద్ భగవద్గీత ను 108 ప్రపంచ భాషల్లో ధ్వని ముద్రణ దిశగా ముందుకు సాగుతున్న గాన తపస్వి డా.గజల్ శ్రీనివాస్. ఆంధ్ర సారస్వత పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షుడు గా తెలుగు భాష కు విశేష మైన సేవ చేస్తూ మూడు ప్రపంచ తెలుగు మహా సభలు తెలుగు జాతి గర్వించేటట్టుగా నిర్వహించిన

డా .గజల్ శ్రీనివాస్ నిజమైన తెలుగు సైనికుడు .ఎన్నో ప్రపంచ రికార్డులు సృష్టించిన గానం ఆయనది.2008 లో ఒక సంగీత కచేరీలో వంద భాషల్లో గానం చేసి తొలి గిన్నీస్ ప్రపంచ రికార్డును, 2009 లో ది పాత్ ఆఫ్ మహాత్మా గాంధీ అన్న ఆడియో ఆల్బంలో 125 భాషల్లో 125 గీతాలను ధ్వని ముద్రణ చేసి రెండవ గిన్నీస్ ప్రపంచ రికార్డును, 2010 లో 24 గంటలలో 55



సంగీత కచేరీలు వివిధ వేదికలపై నిర్వహించి మూడవ గిన్నీస్ ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నారు., వరుసగా 2008, 2009, 2010 సంవత్సరాల్లో ప్రపంచ రికార్డులు సృష్టించి హ్యాట్రిక్ రికార్డు సాధించిన ఏకైక గాయకుడు డా.గజల్ శ్రీనివాస్ .తిరంగ యాత్ర, జలియన్ వాలా బాగ్ శతాబ్ది గీతం, హైఫా యుద్ధ శతాబ్ది గీతం, అల్లూరి సీతారామరాజు శతాబ్ది గీతం, ఆజాదీక అమృత మహోత్సవ గీతాలు, షహీద్ మేలా ఉత్సవ గీతాలు, నమో గంగ ప్రచార గీతం, అయోధ్య మందిర నిర్మాణ అవగాహనా గీతం, జై శ్రీరామ్ గీతాలు , యువ చైతన్య గీతాలు, జై తెలంగాణ గీతం, ఎన్నో భక్తి చాలీసాలు, వివిధ దేవుళ్ళపై తెలుగులో సుప్రభాతాలు ఇలా ఎన్నోఅపురూప మైన గీతాలు ఆయన మధురమైన స్వరం నుండి వెలువడ్డాయి. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం 2008 లో ఆయనకు గౌరవ డి. లిట్ ( డాక్టర్ ఆఫ్ లెటర్స్) ప్రదానం చేసింది.ఆయనను ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మక మైన హంస, కళా రత్న పురస్కారం తో 2012 లో సత్కరించింది. ఆఫ్ఘనిస్తాన్ ఒలింపిక్ అసోసియేషన్ డా.గజల్ శ్రీనివాస్ ను ఆఫ్ఘనిస్తాన్ పీస్మెడల్ తో సత్కరించింది. ఆయనను ప్రతిష్టాత్మక లతా మంగేష్కర్ పురస్కారం, కబీర్ సూఫీ గాన పురస్కారం, సత్యాగ్రహ శాంతి దూత పురస్కారం, మంత్రాలయ రాఘవేంద్ర వైభవ కళా పురస్కారం ఇలా 500 పైగా అవార్డులు, పురస్కారాలు వరించాయిమారిషస్ లో మారిషస్ దేశాధ్యక్షునిచే విశ్వ సంగీత శాంతి దూత పురస్కారం అందుకుని, ఆయన చేతుల మీదుగా శ్రీమద్ భగవద్గీత ఆంగ్ల ఆడియో విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది తెలుగు గజల్ ప్రేమికుల అభిమానం సొంతం చేసుకున్న శ్రీనివాస్ తన తల్లిదండ్రులు రత్నావళి, నరసింహారావు స్ఫూర్తితో తన సతీమణి సురేఖ



సంపూర్ణ సహకారంతో తన ఏకైక కుమార్తె సంస్కృతి నిర్వహణలో ఈనెల 14వ తేదీన గుంటూరులోనిభారతీయ విద్యా భవన్ లోగజల్ శ్రీనివాస్ 50 ఏళ్ల సంగీతం, 40 ఏళ్ళ గజల్ గాన యాత్ర మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశారు.50 వసంతాల సంగీత ఉత్సవం, 40 వసంతాల తెలుగు గజల్ గాన వేడుకలు, 60 వసంతాల తెలుగు గజల్కు నీరాజనం కార్యక్రమాలను అక్టోబర్ 14, న గుంటూరులోని భారతీయ విద్యా భవన్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.డా. గజల్ శ్రీనివాస్ కుమార్తె, యువ తెలుగు గజల్ గాయని కుమారి సంస్కృతి కేశిరాజు ఈ మహోత్సవ నిర్వహణ బాధ్యతలను భుజాన వేసుకొని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.ఉదయం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా గజల్ గానం, గజల్ కవి సమ్మేళనం, గ్రంథావిష్కరణలు, డాక్యుమెంటరీ ఆవిష్కరణ, నృత్య రూపకాలు, సాహిత్య--సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.డా. సి. నారాయణ రెడ్డి దివ్యాశీస్సులతో, డా. దాశరథి స్మృతికి నివాళిగా తెలుగు గజల్ కవులు ప్రత్యేకంగా అరవై

వసంతాల తెలుగు గజల్కు నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఈ మహోత్సవంలో భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖ ఉర్దూ గజల్ కవులు కూడా పాల్గొననుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఉర్దూ గజల్ సంప్రదాయం, తెలుగు గజల్ సాహిత్య వికాసం ఒకే వేదికపై కలుసుకునే అరుదైన సాహిత్య సంగమంగా ఈ కార్యక్రమం రూపుదిద్దుకోనుంది.అలాగే గజల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డా. గజల్ శ్రీనివాస్ నిర్వహించిన తెలుగు గజల్ రచనా శిబిరాలు, సదస్సులు, శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని నిరంతరం తెలుగు గజల్ రచనలు కొనసాగిస్తున్న వందలాది మంది గజల్ కవులు కూడా ఈ



వేడుకలకు హాజరుకానున్నారు. ప్రత్యేకంగా నిర్వహించే గజల్ కవి సమ్మేళనంలో ఈ కవులు తమ స్వీయ గజళ్లను వినిపించనున్నారు. ఒకే వేదికపై కొన్ని వందల మంది తెలుగు గజల్ రచయితలు, ఉర్దూ గజల్ కవులు, సాహితీవేత్తలు సమాగమం కావడం తెలుగు గజల్ చరిత్రలో ఒక అరుదైన ఘట్టంగా నిలవనుంది.ఈ సందర్భంగా రచయిత తపస్వి పంతుల వెంకటేశ్వరరావు రచించిన, డా. గజల్ శ్రీనివాస్ జీవన విశేషాలను పద్యరూపంలో ఆవిష్కరించిన "గజల్ శ్రీనివాసం" పద్య శతకం



ఆవిష్కరించనున్నారు.అలాగే డా. ఎస్.ఆర్.ఎస్. కొల్లూరి రచించిన "డా. గజల్ శ్రీనివాస్ నానీలలో" గ్రంథాన్ని విడుదల చేయనున్నారు. డా. గజల్ శ్రీనివాస్ స్వయంగా రచించిన తెలుగు గజళ్ల సంపుటి "గజల్ నజరానా" కూడా అదే రోజు లోకార్పణ కానుంది.డా. గజల్ శ్రీనివాస్ కళా, సాహిత్య, సామాజిక, శాంతి ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ కె. సతీష్ కుమార్ రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీని కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించనున్నారు.డా. గజల్ శ్రీనివాస్ గానం చేసిన "గేయ రామాయణం"కు ప్రత్యేక నృత్య రూపకాన్ని ప్రదర్శించనున్నారు. అదేవిధంగా ఆయన స్వరపరచి, గానం చేసిన సనాతన ధర్మ భక్తి గీతాలకు కళాకారులు ప్రత్యేక నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నారు.తెలుగు గజల్ కవి శ్రీ కోరుప్రోలు మాధవరావు రచించిన "మస్తానా" గజల్ సంపుటిని డా. గజల్ శ్రీనివాస్కు అంకితం చేయనున్నారు.ఈ మహోత్సవంలో అత్యంత ప్రత్యేక ఆకర్షణగా డా. గజల్ శ్రీనివాస్ కుమార్తె కుమారి సంస్కృతి కేశిరాజు తెలుగు గజల్ గాన విభావరి నిర్వహించనున్నారు. డా. గజల్ శ్రీనివాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ గాన కార్యక్రమం వేడుకలకు ప్రత్యేక శోభను చేకూర్చనుంది.దాదాపు అర్థశతాబ్దంగా సంగీత ప్రపంచంలో కొనసాగుతున్న డా. గజల్ శ్రీనివాస్ ప్రస్థానం కేవలం ఒక గాయకుడి ప్రయాణం మాత్రమే కాదు. గాయకుడిగా, గజల్ రచయితగా, స్వరకర్తగా, అహింసావాదిగా, సత్యాగ్రహవాదిగా, శాంతి సందేశకుడిగా, మానవతా విలువలకు ప్రతినిధిగా ఆయన నిర్మించుకున్న సమగ్ర వ్యక్తిత్వం ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.



# 5వ తరగతి విద్యార్థులకు విజ్ఞాన ప్రతిభ పోటీలు

## పల్లెల్లో మట్టిలో మాణిక్యాలను వెలికి తీసే ప్రక్రియ

## ఈనెల 18న చాకిపల్లి కొత్తూరులో ప్రతిభ పోటీలు

**టెక్కలి అక్టోబర్ 10 జయ జయహే**

గ్రామీణ పల్లెల్లో విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలు ప్రతిభాపాటవాలు విజ్ఞాన విశేషాలను వెలికి తీసి బాల్య దశలోనే ప్రతిభకు పురస్కారం అందించి ఉత్తమ భవిష్యత్తు కు నాంది పలికేందుకు ఈనెల 18న చాకిపల్లి కొత్తూరు లో 5వ తరగతి విద్యార్థులకు దసరా సంబరాల్లో భాగంగా టాలెంట్ టెస్ట్ లను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అసోసియేషన్ కన్వీనర్ మంతిని అప్పన్న తెలిపారు. విద్యార్థుల్లో విజ్ఞానము మంచి ఆలోచన విధానం, చారిత్రక స్ఫూర్తి ప్రభావాలు, సమాజంలో పోటీ తత్వం, చక్కని పౌరులుగా ఎదిగేందుకు అవసరమైన ఆలోచన పరిజ్ఞానం కలిగించేందుకు ప్రతిభ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు, గెలుపొందిన విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు, జ్ఞాపికలు అందించి గ్రామ పెద్దల సమక్షంలో సత్కరించడం జరుగుతుందని ఈ పోటీల్లో జనరల్ నాలెడ్జ్ ఇంగ్లీషు ,తెలుగు, గణితము ,సైన్స్ ,సోషల్ స్టడీస్ సంబంధిత ప్రశ్నలు ఉంటాయని అప్పన్న తెలిపారు. ఈ సదవకాశాన్ని టెక్కలి నియోజకవర్గం స్థాయిలో పాఠశాలల్లో చదువుతున్న గ్రామాలకు చెందిన విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, తల్లిదండ్రులు ,9000841147, 8179440466, 9381432629 ,9550782631, ఫోన్ నెంబర్లను సంప్రదించాలని, నిర్వాహకులు మంతిని అప్పన్న, చంద్రశేఖర్, అనిల్, కిరణ్, కామరాజు,పాపారావు, దుర్గారావులు పేర్కొన్నారు.

For a pure tomorrow.. జయహో

# ఒక్క గాజుతో వీడిన హత్య రహస్యం!

(ప్రతాప్)




దట్టమైన అటవీ ప్రాంతం.. గుర్తుపట్టలేనంతగా కాలిపోయిన మహిళ మృతదేహం.. చుట్టూ ఎలాంటి ఆధారాలూ కనిపించని పరిస్థితి! ఆ మహిళ ఎవరు? అడవిలోకి ఎలా వచ్చారు? ఆమెను హత్య చేసింది ఎవరు? కర్ణాటక పోలీసులను దాదాపు రెండు వారాలపాటు వేధించిన ఈ ప్రశ్నలకు చివరకు ఒక చిన్న గాజు సమాధానం చూపించింది. హంతకుడు వదిలిపెట్టిన ఆ ఒక్క ఆధారమే సంచలన హత్య కేసును ఛేదించేందుకు దారితీసింది.

కర్ణాటకలోని యాదగిరి జిల్లా బచ్‌వార్ అటవీ ప్రాంతంలో సెప్టెంబర్ 24న గస్తీ తిరుగుతున్న అటవీ సిబ్బందికి కాలిపోయిన మహిళ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పాక్షికంగా కాలిపోవడంతో గుర్తించడం కష్టమైంది. ఎక్కడా స్పష్టమైన ఆధారాలు లభించలేదు. అయితే అక్కడ కనిపించిన ఒక గాజును పోలీసులు జాగ్రత్తగా భద్రపరిచారు.

జిల్లా ఎస్పీ పృథ్విక్ శంకర్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల్లో నమోదైన అదృశ్యం ఫిర్యాదులను పరిశీలిస్తుండగా కలబురిగి జిల్లా వాడి పోలీస్‌స్టేషన్‌లో శాంతమ్మ అనే మహిళ కనిపించడం లేదని ఫిర్యాదు నమోదైనట్లు తెలిసింది. పోలీసులు ఆమె కుటుంబ సభ్యులను సంప్రదించి ఘటనా స్థలంలో లభించిన గాజును చూపించారు.




దానిని చూసిన శాంతమ్మ కుమారుడు దేవేంద్ర ఒక్కసారిగా గుర్తుపట్టాడు. అది తన తల్లి ధరించే గాజేనని చెప్పడంతో దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. మృతురాలు నాల్వార్ గ్రామానికి చెందిన శాంతమ్మగా గుర్తించారు.

అనంతరం పోలీసులు ఆమె ఫోన్ కాల్ వివరాలను పరిశీలించారు. బెంగళూరులో స్థిరాస్తి వ్యాపారం చేస్తున్న సురేష్‌తో ఏడాదిన్నర కాలంలో సుమారు 500 ఫోన్ సంభాషణలు జరిగినట్లు వెల్లడైంది. హత్యకు ముందు రోజు అతడు తమ ఇంటికి వచ్చినట్లు శాంతమ్మ కుమారుడు పోలీసులకు తెలిపాడు.

దీంతో సురేష్‌పై అనుమానాలు బలపడ్డాయి.

పోలీసుల కథనం ప్రకారం, శాంతమ్మ సురేష్‌కు సుమారు లక్ష రూపాయలు అప్పుగా ఇచ్చింది. ఆ డబ్బు తిరిగి ఇవ్వాలని, తనను వివాహం చేసుకోవాలని కోరడంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. సెప్టెంబర్ 20న సురేష్ ఆమెను ద్విచక్ర వాహనంపై తెలంగాణ సరిహద్దు సమీపంలోని జలాల్‌పూర్‌కు తీసుకెళ్లాడు. అక్కడి నుంచి బచ్‌వార్ అడవికి తీసుకెళ్లి, స్పృహ కోల్పోయిన సమయంలో గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు.

అనంతరం ఆధారాలు చెరిపివేసేందుకు మృతదేహంపై పెట్రోలు పోసి నిప్పంటించి బెంగళూరుకు పరారైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. పోలీసులు అతడిని అరెస్టు చేసి, శాంతమ్మ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆమె బంగారు ఆభరణాల విక్రయంపైనా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నిందితుడిని న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి తరలించింది. మృతదేహాన్ని కాల్చివేసి గుర్తింపును చెరిపేయాలని ప్రయత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సురేష్‌ను పట్టుకోవడంలో, అడవిలో మిగిలిన ఒక్క గాజే కీలక ఆధారమైంది.

(మీడియా వార్తల ఆధారంగా)

# జాబితా సవరణలో ఓటరే ముఖ్యం!

(ప్రతాప్)

**ఎన్నికల రోజున గుర్తింపు కార్డు చేతిలో ఉన్నా, జాబితాలో పేరు లేకపోతే పౌరుడు ఓటు వేయలేడు. తనకు తెలియకుండా పేరు తొలగిపోయిందని పోలింగ్ కేంద్రం వద్ద తెలుసుకున్నప్పుడు, అప్పటివరకు జరిగిన అవగాహన ప్రచారాలు అతనికి ఉపయోగపడవు. అందుకే ఎన్నికల వ్యవస్థ ముందుగా సమాధానమివ్వాల్సిన ప్రశ్న ఒక్కటే: జాబితాను శుద్ధి చేస్తూ అర్హుడైన ఓటరును బయటకు నెట్టడం లేదని ఎలా నిర్ధారిస్తున్నాం?**




మహారాష్ట్రలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ఈ ప్రశ్నకు ప్రాధాన్యాన్ని తెచ్చింది. సవరణకు ముందు 9.79 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ఆగస్టు 31న ప్రచురించిన ముసాయిదాలో 7.72 కోట్ల పేర్లు నమోదయ్యాయి. మరో 2.07 కోట్ల మంది నుంచి గణన పత్రాలు సేకరించలేకపోయినట్లు వెల్లడైంది. ఇవి తుది తొలగింపులు కావని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అయినప్పటికీ, అంతమంది పేర్లు ముసాయిదాలో లేకపోవడం విస్తృతమైన పునఃపరిశీలన అవసరాన్ని చూపుతోంది.

అదే రాష్ట్రంలో 1.22 కోట్ల మంది వివరాల్లో వ్యత్యాసాలు గుర్తించారు. వీరిలో 62.48 లక్షల మందికి సమాచారం సరిపోలకపోగా, 59.76 లక్షల మందిని పాత జాబితాల్లోని బంధువుల వివరాలతో అనుసంధానించలేకపోయారు. వివరాలు సరిపోలకపోవడం పరిశీలనకు కారణం కావచ్చు; అనర్హతకు స్వయంచాలక నిర్ధారణ కాలేదు. పాత నమోదులో తప్పు, పేరులో అక్షరభేదం, కుటుంబ వివరాల్లో మార్పు వల్ల ఏర్పడిన సమస్యను పౌరుడి ఓటుహక్కుపై సందేహంగా మార్చకూడదు.

గోవాలో చిరునామా మార్పు కోసం ఫారం--8 సమర్పించిన ఆరుగురు కుటుంబ సభ్యుల పేర్లు తొలగిపోయిన వ్యవహారంపై బాంబే హైకోర్టు ప్రశ్నించింది. వివరాలను సరిచేయమని కోరినవారు జాబితా నుంచే బయటపడితే, సవరణ లక్ష్యమే దెబ్బతింటుంది. తప్పును గుర్తించిన తర్వాత పేరు పునరుద్ధరణకు సాంకేతిక వ్యవస్థ అడ్డంకిగా మారకూడదు. పౌరుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిని నివారించాలి.

మరణించినవారి పేర్లు, ద్వంద్వ నమోదులు, అనర్హమైన నమోదులను తొలగించడం తప్పనిసరి. కానీ జాబితా శుద్ధికి రెండు సమాన బాధ్యతలున్నాయి: అనర్హమైన నమోదు ఉండకూడదు; అర్హుడైన వ్యక్తి పేరు పోకూడదు. మొదటి బాధ్యతపై చూపే శ్రద్ధ రెండోదానిపైనా ఉండాలి. ఇంటి వద్ద కనిపించని వలస కార్మికుడిని, చదువుకోసం బయట ఉన్న విద్యార్థిని పరిశీలనకు అవకాశం ఇవ్వకుండా పక్కనపెట్టడం సరికాదు.

దీనికి స్పష్టమైన కార్యాచరణ అవసరం. ముసాయిదాలో కనిపించని ప్రతి పేరుకు కారణాన్ని నమోదు చేయాలి. సంబంధిత వ్యక్తికి సమాచారం చేరిందా, స్పందించేందుకు సమయం ఇచ్చారా, సమర్పించిన ఆధారాలను పరిశీలించారా అనే వివరాలు అందుబాటులో ఉండాలి. నిర్ధారిత మరణాలు మినహా ప్రతిపాదిత తొలగింపులకు నోటీసు, స్పందించే అవకాశం కల్పించాలని ఎన్నికల సంఘం మార్గదర్శకాలే చెబుతున్నాయి. వాటి అమలును పర్యవేక్షించాలి.

తొలగింపుల సంఖ్యను ప్రకటించినట్లే పునరుద్ధరించిన పేర్లు, పెండింగ్ ఫిర్యాదులు, పరిష్కారానికి పట్టిన సమయాన్ని కూడా వెల్లడించాలి. ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు ప్రత్యక్ష సహాయం అందించాలి. సిబ్బందికి లక్ష్యం వేగంగా పని ముగించడం కాకుండా, ప్రతి నమోదుపై సరైన నిర్ణయం తీసుకోవడం కావాలి. సవరణకు అవసరమైన వనరులు, సమయం సమకూర్చాలి.

అలాగే ముసాయిదా విడుదలతో బాధ్యత పూర్తయిందని భావించకూడదు. తుది జాబితాకు ముందు తప్పుల సవరణకు తగిన వ్యవధి ఉండాలి. తిరస్కరణకు రాతపూర్వక కారణం ఇవ్వాలి. అప్పీల్‌ను ఎన్నికల తర్వాత పరిష్కరిస్తే కోల్పోయిన ఓటు తిరిగి రాదు. అందుకే పరిష్కార వేగం కూడా హక్కు రక్షణలో భాగమే.

ఈ సమస్యను పార్టీల గెలుపోటముల లెక్కల్లో కుదించకూడదు. ఆధారంలేని ఆరోపణలూ, ఆధారమున్న ఫిర్యాదులపై మౌనమూ విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ఓటరు ఏ పార్టీకి ఓటేస్తాడన్నది అతని నిర్ణయం. అతనికి ఓటు వేసే అవకాశం కల్పించడం వ్యవస్థ బాధ్యత. జాబితా శుద్ధి పేరుతో అర్హుడి గొంతు మూగబోతే, సరిచేయాల్సింది ఓటరు కాదు---ప్రక్రియ!

# 110వ వార్డు పై టీడీపీ, జనసేన పట్టు

## మంగా ఈశ్వర్‌కే కూటమి మొగ్గు

**అనకాపల్లి, అక్టోబర్ 10, జయహో :**



జీవీఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అనకాపల్లి జోన్ లో జనసేన, టీడీపీ మధ్య సందడి మొదలైంది. ప్రధాన పార్టీలు రెండూ అభ్యర్థులను సిద్ధం చేసి బరిలోకి దించేందుకు సిద్ధం చేసుకున్నారు. అనకాపల్లిలో ఆరు వార్డులలో జనసేన పటిష్టంగా ఉండగా, మూడు గ్రూపులతో టీడీపీ ఎదురీదుతుంది. నియోజకవర్గ ఇన్చార్జి పీలా గోవింద సత్యనారాయణ అభ్యర్థులను ఇప్పటికే ఎంపిక చేసారు. అయితే టీడీపీ లో ఉన్న రెండు గ్రూపులు పీలా ఎంపిక చేసిన అభ్యర్థుల గెలుపుకు పని చేస్తారన్న నమ్మకం లేదు. ఉదాహరణకు 110వ వార్డుని పరిశీలిస్తే గత 82 మరియు 83 వార్డుల్లో ప్రధాన భాగాలు కలిసి ఉన్నాయి. అక్కడ గత స్థానిక ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసిన మంగా ఈశ్వర్, టీడీపీ నుండి పోటీ చేసిన బొద్దపు ప్రసాద్ లు ప్రధానంగా ఇపుడు రేస్ లో ఉన్నారు. ప్రస్తుత వార్డు సమీకరణలు చూస్తే ప్రధానంగా జనసేన బలం ఎక్కువగా కనిపిస్తుంది. గతంలో 82వ వార్డు నుండి పోటీ చేసిన తాడి రామకృష్ణ కూడా ఇదే వార్డులో ఉండడం వలన జనసేన సమిష్టి కృషి తో ముందుకి వెళ్తుంది. గత స్థానిక ఎన్నికల్లో జనసేన బీజేపీ కూటమి నుండి పోటీ చేసిన ఐదుగురు అభ్యర్థుల్లో 83వ వార్డు నుండి పోటీ చేసిన మంగా ఈశ్వర్ కి కూటమిలో అత్యధిక ఓట్లు రావడం, స్థానికంగా యువత కి నిత్యం అందుబాటులో ఉండడం, వార్డు పరిధిలో జరిగే ప్రతి సేవా కార్యక్రమంలో తన పాత్ర పోషించడం,పార్టీ పట్ల నిబద్ధత కలిగి ఉండడం, ఆర్థికంగా బలంగా ఉన్న కుటుంబం నుండి రావడం, కూటమి నాయకులు కార్యకర్తలుతో సమన్వయం చేసుకోవడం మంగా ఈశ్వర్ కి కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు. గతంలో ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకుని రాజకీయాలలోకి వచ్చిన ఈశ్వర్ ఆనాటి నుండి పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్నారు.గతంలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పని చేసిన ఈశ్వర్ కు ప్రస్తుత రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆశీస్సులు మెండుగా ఉన్నాయి.అలాగే ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కి ఇష్టుడుగా నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ రాంకీ ముఖ్య అనుచరుడిగా అన్ని విధాల కలిసి రావడంతో ఈశ్వర్ కి కూటమి అభ్యర్థిగా అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే ఇదే వార్డు నుండి జనసేన నుండి తాడి రామకృష్ణ, తాకాసి సత్యందొర,సురభి హరీష్, తాకాసి కన్నబాబు వంటి సీనియర్ జనసేన నాయకులు కూడా తమకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే కొణతాలకు అభ్యర్థన చేసుకోవడం గమనార్హం. ఏదేమైనా మరికొద్ది రోజుల్లో అభ్యర్థి ఖరారు కానుండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొందనే చెప్పాలి. ఇదే వార్డులో టీడీపీ అభ్యర్థికి సొంత పార్టీ నుంచి కనిపించని వ్యతిరేకత ఉంది. ఈ వార్డులో అభ్యర్థి ఎవరైనా టీడీపీకి మాత్రం గెలుపు కోసం శ్రమటోడ్చాల్సిందే. జనసేనలో గ్రూపుల గోల లేకపోవడం ఆ పార్టీకి కలిసొచ్చే అంశంగా చెప్పవచ్చు. అలాగే టీడీపీలో ఒక వర్గం మంగా ఈశ్వర్ కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్న నేపథ్యంలో కూటమి పార్టీలు అభ్యర్థి ఎంపికపై మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.




# నేటి నుండి దసరా శరన్నవరాత్రులు ప్రారంభము

### శరన్నవరాత్రుల ప్రత్యేక శీర్షిక...

### శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి - మొదటి రోజు అలంకారం - విశిష్టత - నైవేద్యం

అపజయంతో పోరాటం చేసి ఎంతో కష్టపడి తొమ్మిది రాత్రులు అత్యంత భయానకరమైన భీకరమైన పోరాటము చేసి,విశేషమైన బలంతో రాక్షసుడిని సంహరించి మహిషాసుర మర్దినిగా పదవరోజు అమ్మవారు దర్శనం ఇచ్చే పండుగ విజయదశమిగా జరుపుకునే తెలుగువారి పండుగలలో అత్యంత ప్రాముఖ్యమైన పండుగ దసరా పండుగ. పిల్లలు పెద్దలు ఎంతో వేడుకగా జరుపుకునే ఈ పండుగలో అమ్మవారిని తొమ్మిది రోజులు తొమ్మిది అలంకరణలతో విశేషంగా పూజ చేస్తారు.బాలా దేవి అంటే చిన్న బాలిక రూపంలోని ఆదిపరాశక్తి. త్రిమూర్తుల శక్తి కలిసిన త్రిగుణాత్మక శక్తి. మనస్సు, బుద్ధి, అహంకారం ఈమె ఆధీనంలో ఉంటాయి. శ్రీ చక్రంలో తొలి దేవత ఈమెనే. ఈమె అనుగ్రహం వస్తేనే మహా త్రిపుర సుందరి అనుగ్రహం వస్తుంది. నిత్య సంతోషం కోసం పూజిస్తారు.

**కథ**

భండాసురుడికి 30 మంది పిల్లలు దేవతలను బాధపెడితే, 9 ఏళ్ల బాలిక రూపంలో హంస రథం మీద వచ్చి ఒక్క అర్ధచంద్ర బాణంతో అందరినీ సంహరించింది. అందుకే బాలా ఆరాధన శక్తివంతమైంది.

**నైవేద్యం:**

- బెల్లపు పరమాన్నం,క్షీరాన్నం.
- పాయసం, గారెల
- తుమ్మి పువ్వులు తో పూజ శ్రేయస్సు.

**అమ్మవారికి ఏ రంగు చీర?**

లేత గులాబీ చీర. మన ఇంట్లో ఉన్న చిన్న పిల్లల్ని చక్కగా అమ్మవారి అలంకరణ చేసి వారికి పారాణి పెట్టి పసుపు కుంకుమతో అలంకరించి అమ్మవారి స్వరూపంగా భావించి అమ్మవారిని ప్రసన్నం చేసుకోవాలి.

మంత్రం: ఓం ఐం హ్రీం శ్రీం బాలా త్రిపుర సుందర్యై నమః.

**రచన**
**ఏ. బాల సౌజన్యకుమారి,**
**తెలుగు ఆచార్యులు,**
**నంది అవార్డు గ్రహీత,**
**ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త**





# పాఠశాలల అభివృద్ధికే ఎస్ఎంసీ కమిటీలు

### పాఠశాలల చైర్మన్లు, వైస్ చైర్మన్లకు టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దేశేంద్ర సన్మానం

**అగనంపూడి అక్టోబర్ 10, జయ జయహే**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు (ఎస్ఎంసీ) కీలకపాత్ర పోషించాలని జీవీఎంసీ 102వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దేశేంద్ర అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం పెంపొందిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో ఇటీవల నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో జీవీఎంసీ 102వ వార్డు పరిధిలోని మూడు జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఏడు ఎంపీపీ పాఠశాలల్లో ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లను కర్రి దేశేంద్ర ఘనంగా సన్మానించారు. అలాగే, ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయంలో ఎస్ఎంసీ కమిటీలకు ఎన్నికైన అగనంపూడి ప్రాంతానికి చెందిన వారిని కూడా దుశ్శాలువాలు కప్పి, యాపిల్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కర్రి దేశేంద్ర మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఎస్ఎంసీ కమిటీలు పనిచేస్తూ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏరియా ఆసుపత్రి డైరెక్టర్ డొక్కా రమేష్, ఎస్ఎంసీ కమిటీల తరపున జంపా శంకరరావు, సఖనాల సుబ్రహ్మణ్యం, 102వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దేశేంద్ర తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, కమిటీ సభ్యులను ప్రోత్సహించేలా సన్మానించడం అభినందనీయమన్నారు. తమను గౌరవించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, 102వ వార్డు టీడీపీ కార్యదర్శి విందుల రాజు, సీనియర్ టీడీపీ నాయకుడు పూడి సత్యారావు, టీఎన్‌టీయూసీ నాయకుడు మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, స్టీల్ ప్లాంట్ నాయకుడు సాయిన సన్యాసిరావు, గాజువాక నియోజకవర్గ తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు గంతకోరు సత్యవతి, టీడీపీ మహిళా నాయకురాళ్లు రావాడ శిరీష, గోపిశెట్టి పద్మతోపాటు 102వ వార్డు ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com